శరణాగతి.. గరుడా చలపతి



స్నపన తిరుమంజనం

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: వాడపల్లి శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం గరుడోత్సవం కనులపండువగా జరిగింది. మలయప్పస్వామి మకరకంఠి, లక్ష్మీహారం వంటి విశేష ఆభరణాలు ధరించి గరుత్మంతుడిపై భక్తులకు ఆశీస్సులు అందించారు. జ్ఞాన వైరాగ్య ప్రాప్తి కోరే మానవులు గరుడిని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయంటూ భక్తకోటికి పండితులు సందేశాన్నిచ్చారు. తొలుత నదీజలాల సంగ్రహణం, మహాస్నపనం, లక్ష కుంకుమార్చన, మహాలక్ష్మీ హోమం తదితర కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు.



శుక్రవారం రాత్రి శ్రీవారి గరుడ వాహన సేవ

:శనివారం మహాపుష్పయోగం, సూర్య చంద్రప్రభ వాహన సేవ, సహస్ర దీపాలంకరణ సేవ ఉంటాయి.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

అమలాపురం కలెక్టరేట్: అనుమతులు లేకుండా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మహేష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. రెవెన్యూ. పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారులు సూచించిన ప్రదేశాల్లో మాత్రమే ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 29 నుంచి 31 సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే అమ్మకాలు సాగించాలన్నారు.

చిన్న పరిశ్రమలకు పెద్ద వేదిక

రూ.13 కోట్లతో పారిశ్రామిక సముదాయం

ఈనాడు, కాకినాడ: సూక్ష్మ- చిన్న- మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించే క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ సముదాయాల (ఎఫ్‌ఎఫ్‌సీ) నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రానికి నాలుగు మంజూరు చేయగా అందులో ఒకటి కాకినాడ జిల్లాకు కేటాయించారు. కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ. 13.30 కోట్లతో పెద్దాపురంలోని పారిశ్రామిక వాడలో పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి. 2.24 ఎకరాల్లో జీ ప్లస్2లో ఫ్యాక్టరీ సముదాయ నిర్మాణ బాధ్యతలను హైదరాబాద్‌కు చెందిన శివరామ కంపెనీకి ప్రభుత్వం అప్పగించింది. తొమ్మిది నెలల్లో పనులు పూర్తిచేయాలన్న షరతు విధించింది. కేంద్ర ప్రభుత్వం 70 శాతం నిధులు రూ. 9.31 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులు రూ. 3.99 కోట్లు వెచ్చించి నిర్మించనున్న ఈ భవనంలో 26 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక యూనిట్లు (ఎంఎస్‌ఎంఈ)కు ప్లాట్లు అందుబాటులోకి వస్తాయి.

ఔత్సాహికులకు ప్రోత్సాహం

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి.. తయారీ రంగానికి ఊతమివ్వాలనేది ఎఫ్‌ఎఫ్‌సీ ఉద్దేశం. గతంలో ఎంఎస్‌ఎంఈలకు స్థలాలు కేటాయిస్తే.. అక్కడ భవనాలు నిర్మించుకుని కార్యకలాపాలు సాగించేవారు. ఇందుకు వ్యయప్రయాసలు పడాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రభుత్వమే బహుళ అంతస్థుల భవనం నిర్మించి నేరుగా గదులు కేటాయించనుంది. భవిష్యత్తులో నేరుగా కార్యకలాపాలు ప్రారంభించే వెసులుబాటు దక్కనుందని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎ.రమణారెడ్డి తెలిపారు.



పెద్దాపురంలో చేపట్టిన నిర్మాణ పనులు

సకల వసతులతో..

ఎఫ్‌ఎఫ్‌సీ నిర్మాణానికి అనువైన స్థలం పెద్దాపురంలో ఉండడంతో ఇటీవల జీప్లస్ 2 భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ 1,360 చ.మీలలో చేపడతారు. మిగిలిన ప్రాంగణాన్ని రహదారులు, పార్కింగ్, పచ్చదనం, ప్రహరీ, విద్యుదీకరణతో పాటు భవిష్యత్తు విస్తరణ అవసరాలకు విడిచిపెట్టారు.

- గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏడు హాళ్లు ఉంటాయి. ఇక్కడ పరిపాలన విభాగం, బ్యాంకు, తపాలా కార్యాలయం, ముడిసరకు నిల్వ కేంద్రం, ప్రథమ చికిత్స కేంద్రం, డాక్యుమెంటేషన్ సెంటర్, క్యాంటీన్ వస్తాయి.
- మొదటి అంతస్తులో 9 హాళ్లు నిర్మిస్తారు. ఇక్కడ టెలీ కమ్యూనికేషన్ సెంటర్, కాన్ఫరెన్స్ హాలు, పోషణ కేంద్రం (క్రెచ్), సైబర్ సెంటర్ ఉంటాయి.
- రెండో అంతస్తులో.. 10 హాళ్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధంచేశారు. ఇక్కడ ప్రదర్శన శాల, ఫ్లోర్ టు ఫ్లోర్ కార్పన్స్ (సీఎఫ్‌సీ- 1, 2 క్యాబిన్లు ఏర్పాటుచేయనున్నారు.

వైకాపా పాలనలో ఇష్టారాజ్యంగా ఇసుక దోపిడీ

రూ. వేల కోట్లు లూటీ చేశారు: మంత్రి నిమ్మల



వాడపల్లి ఇసుక ర్యాంపు నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకుంటున్న మంత్రి రామానాయుడు

చాగల్లు, న్యూస్‌టుడే: అయిదేళ్ల వైకాపా పాలనలో ఇష్టారాజ్యంగా ఇసుక దోపిడీకి పాల్పడ్డారని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలంలోని వాడపల్లి ఇసుక రీచ్‌ను శుక్రవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. రీచ్ నిర్వహణ, ప్రభుత్వ ఆదేశాల అమలు, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం జేపీ వెంచర్స్ పేరిట సుమారు రూ.30 వేల కోట్ల నుంచి రూ. 40 వేల కోట్ల విలువైన ఇసుక లూటీకి పాల్పడిందన్నారు. దీంతో ప్రకృతి సంరక్షణను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో అన్ని రీచ్‌లను ప్రారంభించేందుకు జాతీయ హరిత ట్రైబ్యునల్, కాలుష్య నియంత్రణ బోర్డు అనుమతులు ఇవ్వడం లేదన్నారు. ఎన్డీయే ప్రభుత్వం సహజసిద్ధంగా లభించే ఇసుక ఉచితంగా ప్రజలకు చేరాలనే ఆశయంతో ముందుకెళుతోందన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలోనూ సరఫరా చేసి డిమాండ్‌ను తగ్గించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. వరద తగ్గిన వెంటనే ఓపెన్ రీచ్‌లను వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

పండగ ఆనందం రెట్టింపు

దీపావళి నుంచి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలో భాగంగా మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిని దీపావళి నుంచి ప్రారంభించడానికి నిర్ణయించిన విషయం తెలిసిందే. కోనసీమ జిల్లాలో హెచ్‌పీ, ఇండియన్, భారత్ గ్యాస్ ఏజెన్సీల ద్వారా 6,10,042 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకంలో భాగంగా జిల్లాలో 17,047 కనెక్షన్లు మంజూరు చేశారు. గతేడాది నుంచి మళ్లీ ఆ పథకాన్ని పునరుద్ధరించి మరో 35 వేల వరకు కేటాయించారు. ఆధార్, తెల్ల రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులందరికీ ఏడాదికి మూడు సిలెండర్లు అందిస్తారు.

ఏడాదికి రూ.2500 ఆదా..

జిల్లాలో ప్రస్తుతం గ్యాస్ బండ ధర ఒకటి రూ. 831.50 (దూరాన్ని బట్టి ధర మారుతుంది) ఉంది. కేంద్ర ప్రభుత్వం సిలెండరుకు రూ. 10.62 రాయితీ పోను.. రూ. 821.30 ప్రజలు భరించాలి. సగటున నలుగురు సభ్యులున్న కుటుంబానికి ఒక బండ రెండు నెలలకు మించి రాదు. ఈ లెక్కన ఏడాదికి ఆరు నుంచి ఎనిమిది అవసరం. ప్రభుత్వం ఏడాదికి మూడు ఉచితంగా అందించనుండడంతో ప్రతి కుటుంబానికి రూ. 2500 వరకు ఆదా కానుంది. ఈ నెల 29 నుంచి వచ్చే ఏడాది మార్చి 30 లోపు ఒక సిలిండరు బుక్ చేసుకోవాలని జేసీ నిశాంతి సూచించారు. ఆధార్ ఆధారిత బ్యాంకు ఖాతాల్లో 24 గంటల్లోగా నగదు జమవుతుందన్నారు. ఈ పథకంలో పేర్లు రాని వారు సంబంధిత గ్యాస్ ఏజెన్సీలను సంప్రదించాలన్నారు.

అర్హ తలివీ..

ఉచిత గ్యాస్ సిలెండరు పొందడానికి లబ్ధిదారు ఏదైనా గ్యాస్ ఏజెన్సీలో కనెక్షన్ పొంది ఉండాలి. ఆధార్, తెల్ల రేషన్‌కార్డు అవసరం. ఇబ్బందులు ఎదురైతే టోల్ ఫ్రీ నంబరు 1967ను సంప్రదించవచ్చు.

జిల్లాలో గ్యాస్ ఏజెన్సీలు:
హెచ్‌పీ: 44
ఇండేన్: 33 | భారత్: 14
గ్యాస్ కనెక్షన్లు: 6,10,042
ఉజ్వల: 47 వేలు
తెల్ల రేషన్‌కార్డులు ఉన్న కుటుంబాలు 5.47 లక్షలు

ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం

నేటినుంచి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో క్షేత్రాల సందర్శన

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాష్ట్ర పర్యాటక శాఖ నిర్వహణలో ఒక రోజు ఆధ్యాత్మిక యాత్ర శనివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రాజమహేంద్రవరం సరస్వతీఘాట్‌లోని పర్యాటకశాఖ కార్యాలయం నుంచి శనివారం ఉదయం 6 గంటలకు యాత్ర మొదలవుతుంది. తొలుత కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారిని భక్తులు దర్శించుకుంటారు. అక్కడ్నుంచి అన్నవరం సత్యనారాయణస్వామి, పిఠాపురం కుక్కుటేశ్వర స్వామి, సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి, ద్రాక్షారామ భీమేశ్వరస్వామి, వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయాల సందర్శన ఉంటుంది. అనంతరం రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద గోదారమ్మ నిత్యహారతి తిలకించడంతో ముగుస్తుంది. వాహనంలో 18 మంది భక్తులు ప్రయాణించవచ్చు. ప్రతి శనివారం ఈ యాత్ర ఉంటుంది.



పిఠాపురంలోని పాదగయ క్షేత్రం

టికెట్ ధర(రూ.లలో)
పెద్దలకు : 1000
పిల్లలకు(3 నుంచి 10ఏళ్ల లోపు) : 800
వివరాలకు నంబర్లు: 98486 29341, 98488 83091

అదిగో పాపికొండల విహారం

గోదావరి వరదల నేపథ్యంలో జులై 13 నుంచి నిలిచిపోయిన పాపికొండల విహార యాత్రకు తిరిగి శనివారం నుంచి శ్రీకారం చుట్టారు. గండిపోచమ్మ బోటింగ్ పాయింట్ నుంచి దీనిని ప్రారంభిస్తున్నామని పర్యాటకశాఖ డివిజనల్ మేనేజర్ సీహెచ్ పవన్ కుమార్ తెలిపారు. మాక్ డ్రిల్‌లో భాగంగా వివిధ శాఖల అధికారులతో శుక్రవారం మూడు బోట్లలో వెళ్లి పరిశీలించామన్నారు. గండిపోచమ్మ పాయింట్ నుంచి 40 మంది పర్యాటకులు, నలుగురు సిబ్బంది ప్రయాణించేందుకు వీలుగా సర్ ఆర్థర్ కాటన్ పర్యాటక శాఖ బోటు, 14 ప్రైవేటు బోట్లు శనివారం నుంచి అందుబాటులో ఉంటయి.



దేవీపట్నం వద్ద పర్యాటకబోటుపై పరిశీలన

టికెట్ రుసుము (రూ.లలో)
రాజమహేంద్రవరం నుంచి:
పెద్దలకు-1,250, పిల్లలకు(పదేళ్లలోపు) : 1000
గండిపోచమ్మ బోటింగ్ నుంచి:
పెద్దలకు -1000, పిల్లలకు(పదేళ్లలోపు)- 750
సంప్రదించాల్సిన ఫోన్ నం: 98486 29341

యాత్ర సాగేదిలా.. రాజమహేంద్రవరం ఏపీ పర్యాటక శాఖ కార్యాలయం నుంచి ఉదయం 7.30 గంటలకు వాహనంలో బయలుదేరి గండిపోచమ్మ బోటు పాయింట్‌కు చేరుకుంటారు. అక్కడినుంచి 9.30 గంటలకు యాత్ర మొదలై సాయంత్రం 5.30 గంటలకు మళ్లీ గండిపోచమ్మ పాయింట్‌కు చేరుకుంటుంది. వాహనంలో బయలుదేరి సాయంత్రం 7.30 గంటలకు రాజమహేంద్రవరం చేరుకోవడంతో ముగుస్తుంది.

నిర్వహణ కరవై..!

శిథిలమవుతున్న ఫిషింగ్ హార్బర్ భవనాలు

– న్యూస్‌టుడే, అంతర్వేది

అంతర్వేదిలో నిర్మించిన మినీ ఫిషింగ్ హార్బర్ నిర్వహణ కరవై శిథిలావస్థకు చేరుకుంటున్నా పట్టించుకొనే నాథుడు కరవయ్యారని గంగపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ తరువాత సముద్ర మత్స్య సంపదకు, విక్రయాలకు అనుకూలమైన ప్రదేశంగా 2014-19లో తెదేపా ప్రభుత్వం గుర్తించి దీని నిర్మాణానికి రూ. 32 కోట్లు మంజూరు చేసింది. సీఎం చంద్రబాబు 2016లో భూమిపూజ చేశారు. అప్పటి నుంచి 2019 వరకు సీసీ ప్లాట్‌ఫారాలు, సీసీరోడ్లు, ఐదు భవనాలు, మరుగుదొడ్లు నిర్మించారు. ఇంకా వలల అల్లిక భవనం, శీతల గిడ్డంగులు, విద్యుత్తు సౌకర్యం కల్పించాల్సి ఉండగా 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. హార్బర్‌పై కనీస శ్రద్ధ పెట్టకపోవడంతో పనులన్నీ నిలిచిపోయాయి.

వివరాలు ఇలా..	
వచ్చే మత్స్యకారులు:	విశాఖ నుంచి నెల్లూరు వరకు
ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారం	3 వేల మందికి
రోజువారీ వచ్చే బోట్లు	150



అంతర్వేదిలోని మినీ ఫిషింగ్ హార్బర్

వీటితో పాటు ఏవిధమైన నిర్వహణ లేకపోవడంతో నిర్మించిన భవనాలు బీటలు తీస్తుండటం, తలుపులు పగిలిపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. డ్రెయినేజీలు ఇసుకతో పూడిపోయాయి. ఎక్కడబడితే అక్కడ ముళ్లచెట్లు పెరిగిపోవడంతో హార్బర్ కళావిహీనంగా మారింది. పలు భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా నిలుస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

విద్యుత్తు సౌకర్యం లేక..

తెదేపా హయాంలో 2016 నుంచి 2019 వరకు చకచకా సాగిన పనులు వైకాపా పాలనలో 2019 నుంచి 2024 వరకు ఏ ఒక్కటీ చేయలేదు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం నిలిచిపోయిన పనులను (విద్యుత్తు, తాగునీరు, వలల అల్లిక భవనం) పూర్తి చేయాలని గంగపుత్రులు కోరుతున్నారు. విద్యుత్తు లేకపోవడంతో జనరేటర్ల ద్వారా బోట్లు మరమ్మతుచేసుకోవలసి వస్తోందని అంటున్నారు. తాగునీరు లేకపోవడంతో రోజుకు రూ. 400తో కొనుగోలు చేయవలసి వస్తుందని తెలుపుతున్నారు. వీటివల్ల సమయం వృథా కావడమే కాకుండా అధిక వ్యయం అవుతుందని గగ్గోలు పెడుతున్నారు.

కమిటీ ఏర్పాటుకు జీవో వచ్చింది..

మినీ ఫిషింగ్ హార్బర్ పరిశుభ్రంగా ఉండేలా కృషి చేస్తాం. ఇందుకోసం కమిటీ వేయడానికి జీవో వచ్చింది. కమిటీ వేసి నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తాం. ఇక్కడ ఇంకా చేయవలసిన పనుల గురించి ఉన్నతాధికారులకు తెలియజేశాం. ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేస్తే పూర్తి చేస్తాం.

- హర్షవర్దన్, మత్స్యశాఖ ఏడీ, రాజోలు

పట్ట భద్రులంతా కూటమి అభ్యర్థిని గెలిపించాలి: మంత్రి సుభాష్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా తొలుత శంఖం పూరించింది ఉపాధ్యాయులు, పట్ట భద్రులేనని వారికి జగన్ చేసిన అన్యాయమే కూటమి గెలుపునకు నాంది పలికిందని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతుగా నియోజకవర్గ కూటమి పార్టీల నాయకులతో స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే జాబ్‌మేళాలు ఏర్పాటు చేస్తున్నామని పట్టభద్రులకు న్యాయం చేసేందుకు, నిరుద్యోగులను తగ్గించేందుకు ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్‌ను ప్రోత్సహిస్తుందన్నారు. జగన్ దోచుకున్న సొమ్మును దాచుకునేందుకు, చెల్లెలితో, తల్లితో గొడవ పెట్టుకుంటున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి సుభాష్ విజయానికి ఎలా సహకరించారో పట్ట భద్రులంతా తన గెలుపునకు పూర్తి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రుల నియోజకవర్గ పార్టీ పరిశీలకులు రాయలసీమ ఎమ్మెల్సీ భూమారెడ్డి రామగోపాలరెడ్డి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కడియాల రాఘవన్, కంచుమర్తి బాబూరావు, కూటమి సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సుభాష్, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం

6 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రైతులు పండించిన ధాన్యానికి బహిరంగ మార్కెట్లో ఎక్కువ ధర లభిస్తుంటే అమ్మకాలు చేసుకోవచ్చని, ఆ వివరాలను సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో విధిగా నమోదు చేయించుకోవాలని జేసీ సూచించారు. నవంబరు 6 నుంచి జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. కందిపప్పు, వంట నూనెలను ప్రత్యేక కేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ నాగేశ్వరరావు, డీఎస్‌వో ఉదయ్‌భాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. శుక్రవారం అమరావతి నుంచి రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ వీరపాండ్యన్ దూరదృశ్య సమావేశం నిర్వహించి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు, ధాన్యం కొనుగోళ్లు, నిత్యవసర సరకుల పంపిణీపై సమీక్ష నిర్వహించారు.



నిర్మాణ దశలో రిలయన్స్ బయో ఎనర్జీ ప్లాంటు

పెద్దాపురంలో రిలయన్స్ బయో ఎనర్జీ కాంప్లెక్సులు

వచ్చే ఏడాది అందుబాటులోకి మూడు యూనిట్లు

ఈనాడు, కాకినాడ: కాకినాడ జిల్లా పెద్దాపురం లోని పారిశ్రామిక వాడలో రిలయన్స్ బయో ఎనర్జీ లిమిటెడ్ ఆధ్వర్యంలో మూడు బయో ఎనర్జీ కాంప్లెక్సుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కే-1, కే-2, కే-3 పేరిట ఒక్కో ప్లాంటు



కాంప్లెక్స్-1 ముఖద్వారం

రోజుకు 22.51 టన్నుల బయో గ్యాస్ ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. దీని కోసం ఒక్కో ప్లాంటుకు రూ.116 కోట్లు చొప్పున వెచ్చిస్తున్నారు. వ్యవసాయ ఆధారిత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయ, పశు, మున్సిపల్ వ్యర్థాల ద్వారా ఈ ప్లాంటుల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వరి, జొన్న, చెరకు, నిమ్మజాతి వ్యర్థాలు, కూరగాయలు, పండ్లు, పూల వ్యర్థాలను చిన్నచిన్న ముక్కలుగా కట్ చేసి, శుద్ధిచేసి ఈ ప్లాంట్ల ద్వారా బయో గ్యాస్ ఉత్పత్తి చేస్తారు. వ్యర్థాల సేకరణకు మార్కెటింగ్ వ్యవస్థను రిలయన్స్ సంస్థ సిద్ధం చేసింది. ప్లాంట్ల నిర్వహణ ద్వారా వెలువడే వ్యర్థాలను పంట పొలాలకు ఎరువుల కింద వినియోగించుకోవచ్చు. ఇప్పటికే ఉత్తర్‌ప్రదేశ్‌లో ఇలా రెండు వేల ఎకరాలకు ఎరువుగా వ్యర్థాలు అందిస్తున్నట్లు ఏపీ-తెలంగాణ ప్రాంతీయ హెడ్ కృష్ణ కుమార్ తెలిపారు. కే-1 యూనిట్ వచ్చే ఏడాది మొదటి 3 నెలల్లో, కే-2 ఏప్రిల్ నాటికి, కే-3 మే నాటికి అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కే-1 కాంప్లెక్సు పనులు ప్రారంభమయ్యాయి. ఒక్కో యూనిట్ ద్వారా 70 మందికి ప్రత్యక్షంగా, 200 మందికి పరోక్షంగా ఉపాధి దొరుకుతుందని చెబుతున్నారు.

ఇద్దరు వ్రత పురోహితుల సస్పెన్షన్

నలుగురు సూపర్‌వైజర్లకు నోటీసులు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం దేవస్థానంలో వ్రత పురోహితులు పెండ్యాల వి.ఆర్.బి.కె.శర్మ, రాయప్రోలు శ్రీ రామచంద్రమూర్తిలను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఈవో కె.రామచంద్రమోహన్ శుక్రవారం ఆదేశించారు. సత్యదేవుని వ్రతమాచరిస్తున్న భక్తుల నుంచి దానాల పేరుతో సొమ్ములు డిమాండ్ చేశారన్న ఫిర్యాదుతో చర్యలు తీసుకున్నారు. ఓ భక్తుడు ఐదేళ్ల రూ.300 వ్రతం చేయించుకున్నారు. ఈ సమయంలో విధుల్లో ఉన్న పురోహితుడు దానాల పేరుతో సొమ్ము డిమాండ్ చేశారు. వ్రత శాల కూడా సస్పెండ్ చేసి వివరం వెలేదు. భక్తుడు రికార్డు చేసి దానిని ఈవోకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా మరో పురోహితుడిపై కూడా ఫిర్యాదు అందింది. దీనిపై విచారణ చేసి రెండో తరగతి పురోహితులు ఇద్దర్ని విధుల నుంచి సస్పెండ్ చేశారు. వ్రత పూజ చేయించుకున్న భక్తులకు పూజాసామగ్రి సక్రమంగా అందించడంలో పర్యవేక్షణ లోపం కారణంగా నలుగురు సూపర్‌వైజర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. వ్రత పురోహితులతో ఈవో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. భక్తులను ఇబ్బందులకు గురిచేసేలా కొంతమంది వ్యవహరిస్తుండటం సరికాదన్నారు. దానాల పేరుతో సొమ్ములు డిమాండ్ చేసినా, భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాకతిప్ప పీహెచ్‌సీ సూపర్‌వైజర్‌పై విచారణ

ఆంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలం వాకతిప్ప పీహెచ్‌సీని అడిషనల్ డీఎంహెచ్‌వో భరతలక్ష్మి శుక్రవారం సందర్శించారు. హెల్త్ సూపర్‌వైజర్ సత్యవతి తరచూ విధులకు గైర్హాజరవుతున్నారంటూ వచ్చిన ఫిర్యాదుపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ జరిపినట్లు భరతలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తల నుంచి లిఖిత పూర్వకంగా వివరాలు సేకరించారు. వాకతిప్ప ఎంపీటీసీ సభ్యుడు కుంచే ప్రసన్నకుమార్ ఆసుపత్రిలో వైద్యసేవలు సక్రమంగా అందడం లేదని ఆమెకు ఫిర్యాదు చేశారు. ఆమె వెంట పీహెచ్‌సీ వైద్యాధికారులు డా.రాకేష్ చౌదరి, డా.చంద్రమౌళి, పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.



వైద్యాధికారి నుంచి వివరాలు సేకరిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో భరతలక్ష్మి

ఎగ్గొట్టిన డబ్బులు ఎలా..!

- అధికారుల తప్పిదానికి.. అద్దెబకాయిలు రూ.7.46 కోట్లు
- మండపేట పురపాలికలో ఇదీ తీరు

న్యూస్‌టుడే, మండపేట

రాజకీయ పలుకుబడి.. అధికారుల ఉదాసీనత.. అద్దె చెల్లించకపోతే ఏం చేస్తారులే అన్న వ్యాపారుల ధీమా వెరసి మండపేట పట్టణంలో పురపాలిక సంస్థ దుకాణాల బకాయిలు రూ. కోట్లకు చేరాయి. ఇప్పుడు ఆ బకాయిలు రాబట్టడానికి అధికారులు నానా ప్రయత్నాలు చేస్తున్నారు. పట్టణంలో పాత మార్కెట్, ట్రావెల్స్ బంగ్లా, కలువపువ్వు సెంటరు, మున్సిపల్ కార్యాలయం ఎదురు దుకాణాల సముదాయాలున్నాయి. మొత్తం 235 దుకాణాలుండగా వీటిలో 43 ప్రస్తుతం ఖాళీగా ఉన్నప్పటికీ మిగిలిన వాటి ద్వారా నెలకు రూ.13లక్షల ఆదాయం మున్సిపాలిటీకి వస్తోంది.



ట్రావెల్స్ బంగ్లా వద్ద దుకాణ సముదాయం

గుదిబండగా మారి...

మండపేట పురపాలక సంఘం పరిధిలోని దుకాణ సముదాయాల్లో లీజు తీసుకుని అద్దె బకాయిలు ఉన్న వ్యాపారుల ఇప్పటి వరకు చెల్లించక పోవడంతో మున్సిపాలిటీకి గుదిబండగా మారింది. 2015 నుంచి 2024 వరకు 83 మంది వ్యాపారులు చెల్లించాల్సిన బకాయిలు రికార్డుల ప్రకారం రూ.3.91 కోట్లు కాగా వడ్డీతో కలిపి 7.46 కోట్లకు పెరిగింది. ఈ క్రమంలో ప్రధాన కూడళ్లలో బకాయిదారుల పేరు తోపాటు, చెల్లించాల్సిన మొత్తంతో కలిపి ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. 2015 నుంచి ఒక వ్యాపారి అద్దె రూ.97వేలు చెల్లించాల్సి ఉండగా ప్రస్తుతం వడ్డీతో కలిపి రూ.2.20లక్షలకు చేరింది. 2016లో మరో వ్యక్తి రూ.79 వేలు చెల్లించాల్సి ఉండగా వడ్డీతో కలిపి రూ.1.79 లక్షలు అయ్యింది. 2017 నుంచి 46 దుకాణాలకు రూ.2.74 కోట్లు చెల్లించాల్సి ఉండగా ప్రస్తుతం వడ్డీతో కలిపి రూ.5.56 కోట్లకు చేరింది. 2018లో ఆరుగురు వ్యాపారులు వడ్డీతో కలిపి రూ.6.54లక్షలు, 2019లో ముగ్గురు కలిపి వడ్డీతో రూ.1.42 లక్షలు, 2020లో అయిదుగురు రూ.23.28లక్షలు, 2021లో 16 మంది కలిపి వడ్డీతో రూ.1.41 కోట్లు. 2022లో ఒకరు రూ.1.22లక్షలు, 2023లో ఇద్దరు రూ.2.15లక్షలు, 2024లో రూ.40వేలు చెల్లించాలి.

గత తప్పిదమే వెంటాడుతోంది

25 సంవత్సరాలు లీజు గడువు ముగిసిన 57 దుకాణాలకు 2014లో మళ్లీ వేలం నిర్వహించారు. అప్పట్లో దుకాణదారులు మళ్లీ దక్కించుకోవాలనే పంతంతో పోటాపోటీగా పాడుకున్నారు. అప్పటి వరకు రూ.3వేలు ఉన్న అద్దె ఒకే సారి రూ.25 వేల నుంచి రూ.40 వేలకు పెరిగింది. అనంతరం తాము అంత అద్దె చెల్లించలేమంటూ వ్యాపారులు కోర్టుకు వెళ్లి మున్సిపాలిటీకి కాకుండా పాత లెక్కప్రకారం అద్దె కోర్టుకు చెల్లించారు. కోర్టు తీర్పు వ్యాపారులకు వ్యతిరేకంగా రావడంతో ఖాళీ చేశారు. కొంత మంది బకాయిలు చెల్లించకుండానే ఖాళీ చేశారు.

అందరి వద్ద వసూలు చేస్తాం...

మొండి బకాయిదారుల పేర్లు ఫ్లెక్సీపై ప్రదర్శించి ప్రధాన కూడళ్లలో ఏర్పాటుచేయడంతో స్పందన వచ్చింది. ఇప్పటికే కొంత మంది వసూళ్లు చేసుకుంటూ డబ్బు సంప్రదింపులు జరుపుతున్నారు. కొంత మంది తాము బకాయిలు లేకున్నా పేరు వేసామని చెబుతున్నారు. వారి నుంచి లేఖలు తీసుకుని రికార్డులు తనిఖీ చేస్తాం. ఇంకా ముందుకు రానివారికి కొద్దిగా సమయం ఇచ్చి తదుపరి చర్యలు తీసుకుంటాం.

- టీవీ రంగారావు, మున్సిపల్ కమిషనర్, మండపేట



ఆలయంలో అలంకరణ చేస్తున్న సిబ్బంది

అప్పనపల్లిలో పవిత్రోత్సవాలకు సర్వం సిద్ధం

మామిడికుదురు, న్యూస్‌టుడే: అప్పనపల్లి బాలబాలాజీస్వామి దేవస్థానంలో శనివారం నుంచి సోమవారం వరకు మూడు రోజులపాటు జరగనున్న పవిత్రోత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేసి మామిడి తోరణాలు, పలు రకాల పూలతో మండపాలను అలంకరించారు. గర్భాలయాల్లో ప్రత్యేకాలంకరణలు చేశారు. పవిత్రోత్సవాల్లో పాల్గొనే హంపీ త్రిదండి చినజీయరుస్వామిజీ శిష్య బృందం గుడివాడ నుంచి ఇక్కడికి వచ్చింది.



చెక్కును విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి రంగసామి

పండక్కి ప్రభుత్వం తరఫున దుస్తులు

యానాం, న్యూస్‌టుడే: దీపావళి సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత దుస్తుల నిమిత్తం రూ.12.76 కోట్లను ముఖ్యమంత్రి ఎన్.రంగసామి శుక్రవారం విడుదల చేశారు. ఎస్సీ మహిళలకు చీర, మగవారికి దుస్తులు కొనుగోలుకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ మేరకు మంత్రి సాయిశరవరన్‌తో కలిసి సీఎం చెక్కును విడుదల చేశారు. దీనికి సంబంధించి యానాంలో 2,552 మంది పురుషులు, 2,949 మంది మహిళలకు రూ.వెయ్యి వంతున రూ.55.01 లక్షలు వారి ఖాతాలకు ఆదిద్రావిడ శాఖ జమ చేసింది.

ముగిసిన విశ్వవిద్యాలయ బాస్కెట్‌బాల్ జట్టు ఎంపికలు

రాజానగరం, న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా నిర్వహించిన అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్ పోటీలు, విశ్వవిద్యాలయ జట్టు ఎంపిక శుక్రవారంతో ముగిశాయి. ఈ పోటీలలో విజేతలను ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్, స్పోర్ట్స్ బోర్డు ఇన్‌ఛార్జ్ కార్యదర్శి ఆచార్య జి.సుధాకర్ శుక్రవారం ప్రకటించారు. ఈ పోటీలలో రామచంద్రాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి స్థానాన్ని, జి.మామిడాడలోని డీఆర్‌కె రెడ్డి కళాశాల ద్వితీయ, పెనుగొండలోని ఎస్‌వీకేపీ కళాశాల తృతీయ, ఏలూరు సీఆర్ఆర్ కళాశాల నాల్గవ స్థానాలను సాధించాయని ప్రకటించారు. క్రీడాకారులకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. టీమ్ సెలక్షన్స్‌కు ఆయా కళాశాలల నుంచి హాజరైన 13 టీమ్‌లు, 12 మంది వ్యక్తిగత క్రీడాకారుల నుంచి ప్రతిభ కనబరిచిన 12 మంది క్రీడాకారులను, అదనంగా మరో నలుగురు క్రీడాకారులను నన్నయ విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేశారని రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్ తెలిపారు. ఈ జట్టు నవంబరు ఒకటి నుంచి ఐదో తేదీ వరకు బెంగళూరులోని క్రైస్ట్ యూనివర్సిటీలో నిర్వహించే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటారన్నారు. నిర్వహణా కార్యదర్శి డా.ఎం.వి.ఎస్.ఎస్.మూర్తి, సెలక్షన్ కమిటీ సభ్యులు, రైల్వేకోచ్ ప్రసాద్, బాపిరెడ్డి, పరిశీలకుడు పీఆర్ కళాశాల పీడీ రమణ, కోర్స్ కోఆర్డినేటర్ డా.కె.బాలసత్యనారాయణ, డా.ఎ.సత్యనారాయణ, డా.బి.రామ్‌గోపాల్, డేవిడ్, పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు.



ఎంపికైన నన్నయ విశ్వవిద్యాలయ జట్టుతో రిజిస్ట్రార్ సుధాకర్

ముగిసిన అథ్లెటిక్స్ పోటీలు

శ్యామలాసెంటర్ (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అథ్లెటిక్స్ జిల్లా జట్టు ఎంపికలు శుక్రవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగిశాయి. అండర్-17 విభాగంలో రెండోరోజు జరిగిన పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరికి పరుగు, జంప్స్, త్రో విభాగంలో ఎంపికలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను వచ్చేనెల 4 నుంచి శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు కార్యదర్శి స్వామి పేర్కొన్నారు.



వంద మీటర్ల పరుగులో క్రీడాకారులు



డిస్క్ విసురుతున్న క్రీడాకారుడు

ఆనందకర దీపావళి జరుపుకోవాలి: ఎస్పీ

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజలు దీపావళి పండగను ఆనందంగా నిర్వహించుకోవాలని ఎస్పీ బి.కృష్ణారావు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. బాణసంచా తయారీ, నిల్వలు, విక్రయాలపై సంబంధిత అధికారులు నిఘా ఉంచాలన్నారు. అక్రమ నిల్వలు, అనధికార విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాణసంచా నిల్వచేసే గోదాము, తయారీ, విక్రయాలు చేసేవారు, దుకాణాదారులు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాణసంచా అక్రమంగా తయారు చేస్తే 8143792101 నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు.

రహదారుల పనులు వేగవంతం చేయాలి: జేసీ

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో పలు ప్రాంతాలను ఇతర జిల్లాలతో అనుసంధానం చేసే జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జేసీ నిశాంతి ఆదేశించారు. శుక్రవారం జాతీయ రహదారులు, రైల్వే లైన్ నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. రైల్వేకి సంబంధించి భూసేకరణ, సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని, కోర్టు కేసులను సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అమరావతి నుంచి రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కమిషనర్ సైతం దూరదృశ్య సమావేశం నిర్వహించి పనులపై సమీక్షించారు.

కొట్లాట నడుమ అడవిపాలెంలో భూ సర్వే పూర్తి

మలికిపురం, న్యూస్‌టుడే: అడవిపాలెం పంచాయతీ చెరువుకు సంబంధించిన భూ సర్వే శుక్రవారం కొట్లాటలు, ఘర్షణల మధ్య పూర్తయ్యింది. గ్రామంలో 545/5 సర్వే నెంబరులో 1.96 ఎకరాల చెరువును గతంలో పూడ్చి పలువురు ఇళ్లు నిర్మించుకున్నారు. వీటిని మినహాయించి మిగిలిన స్థలాన్ని సర్వే చేయాలని గ్రామస్థుల నుంచి గ్రామ సభకు అర్జీ రావడంతో.. పంచాయతీ తీర్మానం ప్రకారం రెవెన్యూ అధికారులు, సిబ్బంది ప్రయత్నించగా ఒక వర్గం నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అధికారులు దఫదఫాలుగా రెండు వర్గాలతో చర్చలు జరిపారు. వ్యతిరేకించిన వర్గం గురువారం పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ, పోలీసు అధికారులతో జరిగిన సమావేశంలో సర్వేకు అంగీకరించింది. శుక్రవారం ఉదయం రెవెన్యూ సిబ్బంది సర్వే ప్రారంభించగా.. మళ్లీ రెండు వర్గాల మధ్య ఘర్షణ తలెత్తి కొట్లాటకు దారితీసింది. ఈ దాడిలో కందికట్ల శశికుమార్, యడ్ల రత్తాలు గాయపడ్డారు. గొడవను నియంత్రించడానికి మధ్యలో వెళ్లిన సర్పంచి భర్త కొల్లు నరసింహస్వామి కూడా గాయాలపాలయ్యారు. వీరు ముగ్గురూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రాజోలు సీఐ నరేశ్‌కుమార్, మలికిపురం ఎస్సై సురేశ్‌లు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. కొట్లాటపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై చెప్పారు. మొత్తానికి సర్వే పూర్తయిందని తహసీల్దారు టి.శ్రీనివాసరావు చెప్పారు. అడవిపాలెంలోని ప్రభుత్వ భూమి సర్వే పూర్తి చేసిన మండల రెవెన్యూ అధికారులు, పోలీసులను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అభినందించారు.



దాడిలో గాయపడిన యువకులు

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ

పామర్రు, న్యూస్‌టుడే: తండ్రి అనారోగ్యంతో కన్నుమూయడంతో కుమార్తె తలకొరివి పెట్టి దహన సంస్కారాలు నిర్వహించిన ఘటన కె.గంగవరం మండలం పాణింగపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే... పాణింగపల్లికి చెందిన చాట్రాది సత్యనారాయణ(75) అనే వృద్ధునికి కొడుకులు లేకపోవడంతో కూతురు నేమాని వీరవేణి తండ్రి వద్దనే ఉంటూ అన్నీ తానై సపర్యలు చేస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం అతను మరణించారు. కొడుకులు లేకపోవడంతో ఆమె స్వయంగా దహనక్రియలు నిర్వహిస్తానని పట్టుబట్టారు. దానికి అందరూ ఆమోదం తెలపడంతో కూతురే కొడుగ్గామారి తండ్రికి తలకొరివి పెట్టారు.



తండ్రి అంతిమ యాత్రలో కుమార్తె

ఇసుక అక్రమ రవాణా చేస్తే పీడీయాక్ట్

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే వాహనాలు సీజ్ చేసి పీడీయాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ మహేష్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పథకాన్ని పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు భారం కాకూడదనే కారణంతో సీనరేజీని సైతం రద్దు చేయడం జరిగిందన్నారు. సొంత అవసరాల నిమిత్తం వాగులు, వంకల నుంచి నేరుగా ఇసుకను తవ్వి తీసుకువెళ్లే వెసులుబాటు ఉందన్నారు. దీనికివారు తమ వివరాలను సచివాలయాల్లో నమోదు చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేయడం జరుగుతుందని, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ నిశాంతి, ఆర్డీవోలు కె.మాధవి, కతీబ్ కౌషర్‌బానో, గనులశాఖ అధికారి అశోక్‌కుమార్, సుజాత, కాలుష్య నియంత్రణ మండలి అధికారి శంకర్రావు పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి గనుల శాఖ ముఖ్యకార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా అమరావతి నుంచి దూరదృశ్య సమావేశం నిర్వహించి ఉచిత ఇసుక పథకంపై పమీక్ష నిర్వహించారు.

అత్యాచార నిందితుడి అరెస్టు

పి.గన్నవరం: మండలంలోని ఓ గ్రామంలో పక్షవాత బాధితురాలు(60)పై అత్యాచారం చేసిన ఘటనలో నిందితుడిని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ భీమరాజు నిందితుడిని అరెస్టుచేశారు. నిందితుడు 50 ఏళ్ల లంకే సత్యనారాయణ అని, రాజోలు కోర్టులో హాజరుపరచగా 14 రోజులపాటు రిమాండ్ విధించారని ఎస్సై బి.శివకృష్ణ విలేకరులకు తెలిపారు. సత్యనారాయణను రాజమహేంద్రవరంలోని సెంట్రల్ జైలుకు తరలించామన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	11,500
పాతకాయ: గండేరా	16,000
గటగట	13,500
కొత్తకాయ: గండేరా	15,500
గటగట	13,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	12,000-13,500
కొత్త (పచ్చి) కాయ	11,500-12,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00



ప్రభుత్వ న్యాయవాదిగా విద్యాప్రసన్న



ఆలమూరు, న్యూస్‌టుడే: ఆలమూరు న్యాయస్థానానికి సంబంధించి అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా జొన్నాడవాలంకకు చెందిన న్యాయవాది జుజ్జి విద్యాప్రసన్న నియమితులయ్యారు. త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆమెను పలువురు అభినందించారు.

రహదారి నిర్మాణానికి భూమిపూజ

మలికిపురం: స్థానిక ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం పక్క నుంచి రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రహదారి, డ్రెయినేజీ నిర్మాణానికి ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి శుక్రవారం భూమి పూజ చేశారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టరు గుండుబోగుల పెద్దకాపు, సర్పంచి గెడ్డం రాజ్యలక్ష్మి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కాకి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

వ్యవసాయ క్షేత్రాల సందర్శన

రాజోలు, సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: వేగివారిపాలెం, తాటిపాకలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను రామేశ్వరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా వ్యవసాయం చేసే విధానాలపై అదనపు డీపీఎం సత్యనారాయణ అవగాహన కల్పించారు.



వ్యవసాయ పద్ధతులపై వివరిస్తున్న అధికారులు

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు స్పందన

కైకలపేటలో పరిసరాలు శుభ్రం

మామిడికుదురు: పాశర్లపూడి పరిధి కైకాలపేట వద్ద పరిసరాలు అధ్వానంగా ఉండటంతో అనారోగ్య పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు చెప్పిన సమస్యను సర్పంచి కొనుకు ప్రేమజ్యోతి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించారు. అక్కడి పరిసరాలను శుభ్రం చేయించి నివాసిత ప్రాంతమంతా బ్లీచింగ్ చల్లించారు.

డ్రెయినేజీ శుభ్రం.. రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెం ఇందిరాకాలనీలో డ్రెయిన్ పూడిక పోవడంతో మురుగునీరు ముందుకు పారక ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీవాసులు తెలిపిన సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎల్.దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి, సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట:90323 93884

ఆదరిస్తే.. ఆదాయ వనరే!

న్యూస్‌టుడే, మామిడికుదురు, రాజోలు

చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారుచేసి పంచాయతీలకు ఆదాయ వనరుగా తీర్చిదిద్దే లక్ష్యంతో 2017లో అప్పటి తెదేపా ప్రభుత్వం రూపొందించిన ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు గత వైకాపా పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఒక్కొక్కటి సుమారు రూ.5 లక్షల చొప్పున వ్యయంతో నిర్మించిన కేంద్రాలు కార్యాచరణ లేక వెలవెలబోతున్నాయి. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు చేపట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వీటిపై దృష్టి పెట్టడంతో సంపద కేంద్రాలను ఉపయోగంలోకి తెచ్చేందుకు అధికార యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం అధికారులు గ్రామాల్లో వాటిని పరిశీలించి ఏయే సదుపాయాలు కల్పించాలనే దానిపై సమగ్ర నివేదిక రూపొందిస్తున్నారు.



బి.సావరంలో సేంద్రియ ఎరువు తయారు చేస్తున్న కేంద్రం

సంపద కేంద్రాల వినియోగానికి కార్యాచరణ

జిల్లాలో పంచాయతీలు	358
సంపద వృద్ధి కేంద్రాలు	270
ఎరువు తయారవుతున్నవి	193
నిరుపయోగంగా ఉన్నవి	77
కేంద్రాలు నిర్మించాల్సినవి	115

నిర్లక్ష్యంతో నీరుగార్చేశారు..

రాజోలు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లోని 57 గ్రామాల్లో సంపద కేంద్రాలకు నరేగా నుంచి మంజూరైన నిధులతో షెడ్లు వేసి ఉపయోగంలోకి తీసుకొచ్చారు. వీటి చుట్టూ పచ్చదనం పెంచి ఆహ్లాదకరంగా రూపొందించారు. గ్రామాల్లో ఇళ్ల నుంచి తడి, పొడి చెత్త సేకరణకు 250 కుటుంబాలకు ఒక క్లాప్ మిత్రను ఏర్పాటు చేశారు. సంపద కేంద్రం వద్ద హరిత గార్డును నియమించారు. వీరికి వేతనాలు తక్కువగా ఉండడం, సకాలంలో చెల్లించకపోవడంతో వారు దూరమై క్రమేణా చెత్త సేకరణ నిలిచిపోయింది. పాలిథిన్‌ను రీసైక్లింగ్ చేసే యంత్రాలు నిరుపయోగంగా, స్వచ్ఛ సంకల్పంలో ఇచ్చిన రిక్షాలు తుప్పుపట్టి మూలకు చేరాయి. పలుచోట్ల షెడ్లలో వర్మీకంపోస్టు యూనిట్లు నెర్రెలు తీసి శిథిలస్థితికి చేరాయి. నియోజకవర్గంలో మూడు నాలుగు చోట్ల మాత్రమే వర్మీకంపోస్టు యూనిట్లు నిర్వహణ కొనసాగుతోంది.

చెత్తకుప్పలతో కాలుష్యం..

ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు పలుచోట్ల మూతపడడంతో గ్రామాల్లో చెత్తను రహదారులు, పంట కాలువల పక్కన, ఏటిగట్లపై గుట్టలుగా వేస్తున్నారు. వాటిని తగలబెడుతుండడంతో పొగ వెలువడి కాలుష్యం రేగుతోంది. రాజోలు మండలం సోంపల్లి నుంచి పల్లిపాలెం వరకు వశిష్ఠ ఏటిగట్టుపై పలుచోట్ల చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. నది, కాలువల్లోకి చేరడంతో జలాలు కలుషితమవుతున్నాయి.



పాశర్లపూడిలో ఘన వ్యర్థాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌సీ అధికారులు


గ్రామాల్లో బృందం పరిశీలన

కలెక్టర్ ఆదేశాలసారం జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం అధికారులు ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను పరిశీలిస్తున్నారు. వర్మీకంపోస్టు యూనిట్లు, అక్కడికి రాకపోకలకు రోడ్డు సౌకర్యం, చెత్త సేకరణకు క్లాప్‌మిత్రల నియామకం తదితర అంశాలపై మండల పంచాయతీరాజ్, గ్రామ కార్యదర్శులతో కలిసి వివరాలు సేకరిస్తున్నారు. యూనిట్లను సత్వరం వినియోగంలోకి తెచ్చి సేంద్రియ ఎరువు తయారు చేయడంతో సంపద కేంద్రాల లక్ష్యం సార్థకమయ్యేలా కార్యాచరణ చేపట్టాం.

– ఎస్.వి.ఈశ్వరి, జిల్లా రిసోర్స్ పర్సన్
పి.మధు మహేష్, సమన్వయకర్త

ఉపకేంద్రం నిర్మాణంతో నాణ్యమైన విద్యుత్తు

అయినవిల్లి, న్యూస్‌టుడే: పరిశ్రమలు, ఆక్వా రైతులు, గృహవసరాలకు నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు రూ. 301 కోట్ల వ్యయంతో ఇక్కడ నిర్మిస్తున్న 400 కేవీ ఉపకేంద్రం దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం అయినవిల్లిలో విద్యుత్తు ఉపకేంద్రం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తిచేయాలని గుత్తేదారులకు సూచించారు. ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రాజబాబు, డీఈ పుల్లయ్య, రవికుమార్, తహసీల్దార్ నాగలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్



పురుషోత్తపల్లి మహిళల డోలు వాయిద్యం



పట్టువస్త్రాలు తెస్తున్న ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బండారు



గంగమ్మకు పూజలు చేస్తున్న అర్చకులు

రమణీయం.. శ్రీవారి బ్రహ్మోత్సవం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: వాడపల్లిలో వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. శుక్రవారం స్వామివారి మాడ వీధుల్లో భక్తుల గోవింద నామస్మరణల మధ్య మిన్నంటిన వేళ గరుడ వాహనంపై విహరిస్తూ అభయప్రదానం చేశారు. తొలుత పంచామృత మండపారాధన, శోభాయాత్రగా గోదావరి నదీజలాల సంగ్రహణం, లక్ష కుంకుమార్చన, మహాలక్ష్మి హోమం తదితర కార్యక్రమాలను అర్చకులు కమనీయంగా నిర్వహించారు. శ్రీవారు అభిషేక ప్రియుడే కాదు అలంకార ప్రియుడు కూడా. ఇందులో భాగంగా నిర్వహించిన స్నపన తిరుమంజనంలో శ్రీమలయప్ప స్వామి వారి అలంకరణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ కళా ప్రదర్శనలు అలరించాయి. గరుడ వాహన సేవను వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. ఈవో ఎన్ఎస్ చక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామివారికి మండల తెదేపా అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు సత్యశ్రీవాణి దంపతులు, లొల్ల సర్పంచి కాయల జగన్నాథం, మంగాదేవి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు.



బ్రహ్మోత్సవ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు



ఆండాళ్ అమ్మవారికి లక్ష కుంకుమార్చన



ఆకట్టుకున్న కళాకారుల నృత్యం



అంబాజీపేటలో గోడపత్రికలను ప్రదర్శిస్తున్న ఎంపీపీ తదితరులు

పశు గణనకు గ్రామాల్లో కార్యాచరణ

మామిడికుదురు: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 21వ అఖిల భారత పశు గణన శుక్రవారం గ్రామాల్లో మొదలైంది. దీనికి సంబంధించిన గోడ పత్రికలను ఆయా గ్రామాల్లో సర్పంచులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ఆవిష్కరించారు. గ్రామాల్లో గణకుల పశు సంపద వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు మండల పశు వైద్యాధికారి చేగొండి శ్రీరామ్ తెలిపారు.

అంబాజీపేట: పశుగణన గోడపత్రికలను స్థానిక పశువైద్యశాల వద్ద శుక్రవారం ప్రజాప్రతినిధులు, పశువైద్యులు ఆవిష్కరించారు. గ్రామాల్లో పశుగణన కోసం వచ్చే తమ ఉద్యోగులకు, సిబ్బందికి పశుపోషకులు, పాడి రైతులు సహకరించాలని మండల పశువైద్యాధికారి డా.రాజేంద్రప్రసాద్ కోరారు. జడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, పుల్లేటికుర్రు, ముక్కామల పశువైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పదార్థాల తనిఖీ

కొత్తపేట, న్యూస్‌టుడే: గంటిలోని జడ్పీ ఉన్నత పాఠశాలను సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు శుక్రవారం సందర్శించి విద్యార్థుల మధ్యాహ్న భోజన పదార్థాలు తనిఖీ చేశారు. భోజనం రుచి చూసి, విద్యార్థులకు వడ్డించారు. విద్యార్థుల హాజరు, తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాన్ని పరిశీలించారు. విద్యార్థుల ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) డేటా త్వరితగతిన పూర్తి చేయాలని ఇన్‌ఛార్జి హెచ్‌ఎం బండారు శ్రీనివాసరావును ఆదేశించారు. సమగ్రశిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ బి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



విద్యార్థికి భోజనం వడ్డిస్తున్న సర్వశిక్షా డిప్యూటీ కలెక్టర్ మధుసూదనరావు

బాలిక ఆత్మహత్యపై న్యాయవిచారణ చేపట్టాలి

ఆలమూరు, న్యూస్‌టుడే: మండలంలో ప్రైవేటు పాఠశాల విద్యార్థిని ఆత్మహత్య ఘటనపై విచారణ వేగవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ జి.రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. కోకన్వీనర్ వెంకట్, సురేష్, సందీప్ శ్యామ్, భానుకార్తీక్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా మూర్తి



ఆత్రేయపురం: ఆత్రేయపురం రెవెన్యూ కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్‌గా రాపాక దుర్గారామచంద్రమూర్తి, ఆర్ఐగా ఎం.భాను నియమితులయ్యారు. ఇక్కడి ఆర్ఐ భవాని కొత్తపేట మండలానికి బదిలీపై వెళ్లారు.

కౌలు రైతుల రక్షణకు సమగ్రచట్టం తీసుకురావాలి

రాజోలు: కౌలు రైతులందరికీ పెట్టుబడి సాయం అందించాలని రాష్ట్ర కౌలురైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. వేగివారిపాలెం, చెన్నడంలో శుక్రవారం ఆయన పర్యటించి రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా కార్యదర్శి బుజ్జిబాబు, వాసంశెట్టి బాలకృష్ణ, మామిడిశెట్టి నాగరాజు, రాపాక రమేష్‌బాబు, గిడుగు గణేష్, బండారు రామారావు, కాండ్రేగుల రామారావు పాల్గొన్నారు.

భారతీయ కిసాన్ సంఘ్ నూతన కార్యవర్గం

అంబాజీపేట: భారతీయ కిసాన్ సంఘ్ మండలశాఖ అధ్యక్షుడిగా కొప్పిశెట్టి ఆనందవెంకటప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పుల్లేటికుర్రు సహకారసంఘ కార్యాలయంలో కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కార్యదర్శిగా అయ్యగారి శ్రీనివాసరావు, సభ్యులుగా మట్టపర్తి భాస్కరరావు, మేడేపల్లి వెంకటేశ్వరరావు, నిట్టాల సాయి, మట్టపర్తి రాంబాబు ఉన్నారు.

యువతి అపహరణకు యత్నం.. కేసు

కొత్తపేట, న్యూస్‌టుడే: ప్రేమ పేరుతో కోరుమిల్లికి చెందిన పోలిశెట్టి కృష్ణ, మరికొంత మంది ఓ యువతిని అపహరించడానికి యత్నించారని కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై జి.సురేంద్ర తెలిపిన వివరాల ప్రకారం, కోరుమిల్లికి చెందిన దంగేటి వెంకటరత్నం తన కుమారుడు, కుమార్తెతో కలిసి ఈ నెల 20న ముక్కామల వెళ్లి తిరిగి వస్తుండగా కొత్తపేట సాయిబాబా గుడి వద్దకు చేరుకునేసరికి కృష్ణ, మరో తొమ్మిది మంది అపహరించేందుకు ప్రయత్నించారన్నారు. వారు తప్పించుకుని విషయాన్ని గ్రామ పెద్దలకు తెలియజేయగా, వారి సూచన మేరకు ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

ఆలమూరు, న్యూస్‌టుడే: తమ కుమార్తె బుధవారం పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని చెముడులంకకు చెందిన తల్లిదండ్రులు శుక్రవారం ఆలమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక జడ్పీ పాఠశాలలో ఆమె పదో తరగతి చదువుతోందన్నారు. బంధువుల ఇంట వాకబు చేసినా ఆచూకీ లభించలేదన్నారు. అదృశ్యం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

అంతర్వేది, న్యూస్‌టుడే: నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు అండర్-14 బాలికల విభాగంలో సఖినేటిపల్లి మండలం అంతర్వేది జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థినులు అడబాల జయసాయిదుర్గ గుణవర్థిని, పిల్లా యామిని కాంస్య పతకాలు సాధించారని ప్రధానోపాధ్యాయిని సూర్యకుమారి తెలిపారు. వ్యాయామోపాధ్యాయుడు భాస్కరరావును, పతకాల విజేతలను ఎంఈవోలు కిషోర్‌కుమార్, వేంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.



బాలికలతో వ్యాయామోపాధ్యాయుడు

పరుగు పందెంలో...



అంబాజీపేట: రాష్ట్రస్థాయిలో నిర్వహించే అథ్లెటిక్ 400 మీటర్ల పరుగు పోటీలకు అంబాజీపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడాకారిణి కె.లక్ష్మీ ప్రసన్న ఎంపికైనట్లు హెచ్‌ఎం.కడలి సాయిరాం, పీడీ కుంపట్ల ఆదిలక్ష్మిలు శుక్రవారం వెల్లడించారు. ఈనెల 24న రాజమహేంద్రవరంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అథ్లెటిక్స్ 400 మీటర్ల పరుగు పోటీలలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఆమె ఎంపికైయిందన్నారు. బాలికను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్‌లో..



అంబాజీపేట: రాష్ట్రస్థాయి అండర్-17 వాలీబాల్ విభాగంలో ముక్కామల కళా వెంకట్రావు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడాకారిణి మోరంపూడి చాందిని ప్రతిభ కనబరిచారని హెచ్‌ఎం.మూర్తి తెలిపారు. 68వ రాష్ట్రస్థాయి స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ, అనంతపురం, హిందూపురంలో ఈ నెల 21 నుంచి 23 వరకు జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు తరుపున చాందిని పాల్గొని ప్రతిభ చూపారు. పీడీ ముత్యాల పవన్‌కిషోర్‌తో పాటు పలువురు బాలికను అభినందించారు.

జిల్లాస్థాయి డిస్కస్‌త్రోలో..



పి.గన్నవరం: మండలంలోని ముంగండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న కాండ్రేగుల సాయి దీపిక స్కూలుగేమ్స్ అండర్-14 విభాగంలో డిస్కస్‌త్రో క్రీడలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద ఈ నెల 24న జరిగిన పోటీల్లో సాయి దీపిక ప్రతిభ చూపిందని హెచ్‌ఎం.కనకదుర్గ తెలిపారు. సాయిదీపికను ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

రావులపాలెం గ్రామీణం: ప్రజలంతా ఐక్యతగా ఉంటూ ముందుకు సాగితే అన్నివిధాలా అభివృద్ధి సాధ్యపడుతుందని దేవరపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీహెచ్‌వీఎస్ఎస్ సాయిరామ్ అన్నారు. విజిలెన్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా స్థానిక యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం దేవరపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ సేవలపై అవగాహన పెంచుకోవాలి

పి.గన్నవరం: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పోలీసు సేవలు గురించి అవగాహన పెంచుకోవాలని పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ సూచించారు. పి.గన్నవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమంలో స్థానిక పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ఆయుధాలు, కేసుల నమోదు, వైర్‌లెస్‌సెట్లో మాట్లాడటం తదితర అంశాలపై ఎస్సై శివకృష్ణ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండండి

కొత్తపేట, న్యూస్‌టుడే: మత్తుపదార్థాలకు, సంఘ విద్రోహ కార్యకలాపాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్ఐ జి.సురేంద్ర అన్నారు. స్థానిక విశ్వకవి వేమన డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ లైసెన్సులు లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రిన్సిపల్ కేపీ రాజు, రమాదేవి, పాపారావు, నాగదీపిక, నాగశ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇత్తడి నంది విగ్రహం బహూకరణ



అంబాజీపేట, న్యూస్‌టుడే: మాచవరంలోని పార్వతీ రాజేశ్వరస్వామి వారి ఆలయానికి ఓ భక్తుడు ఇత్తడి నంది విగ్రహాన్ని బహూకరించారు. రానున్న కార్తీక మాసంలో ఇక్కడ పూజలు నిర్వహించుకునేందుకు అనువుగా దీనిని ఏర్పాటు చేశామన్నారు. సంప్రోక్షణ పూజల అనంతరం ఆలయం ధ్వజస్తంభం వద్ద ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగ రోగులకు చక్రాల కుర్చీలు వితరణ



కొత్తపేట: స్టేట్ బ్యాంకు వారోత్సవాలను పురస్కరించుకుని సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో దివ్యాంగ రోగుల సహాయార్థం అయిదు చక్రాల కుర్చీలను స్థానిక ఎస్‌బీఐ బ్రాంచి మేనేజరు రెడ్డి శివస్వామి, సిబ్బంది అందజేశారు. డాక్టర్ వంశీ, మనోహర్, రవి, ప్రసాద్, నాయుడు గనిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓఎన్జీసీలో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

ఆలమూరు, న్యూస్‌టుడే: పెదపళ్లలో ఓఎన్జీసీ కార్యకలాపాల వల్ల భూగర్భ జలాలు కలుషితమయ్యాయని, భూములకు పాత లీజునే కొనసాగిస్తున్నారని, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని కూటమి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పెదపళ్లలో ఉన్న ఓఎన్జీసీ గ్యాస్ కలెక్షన్ సెంటర్, తదితర చోట్ల స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చూడాలని శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ప్రకాష్‌బాబుకు వారు వినతిపత్రం అందజేశారు.

మద్యం దుకాణం తరలించాలని వినతి


పి.గన్నవరం: పి.గన్నవరం ఏటిగట్టు కూడలి వద్ద ఉన్న మద్యం దుకాణాన్ని ఆ ప్రదేశం నుంచి వేరేచోటుకు తరలించాలని కోరుతూ వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు శుక్రవారం వినతిపత్రాలు అందించారు. ఏటి గట్టు కూడలి నుంచి ఆర్.ఏనుగుపల్లి, వై.కొత్తపల్లి, కె.ఏనుగుపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు ఆటోల కోసం అక్కడ నిరీక్షిస్తారని తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్, తహసీల్దార్ పి.శ్రీపల్లవి, ఎంపీడీవో కె.వి.ప్రసాద్ తదితర శాఖల అధికారులకు వినతిపత్రాలు అందించారు. సర్పంచులు దొమ్మేటి పార్వతి, తోలేటి బంగారునాయుడు, తోరం వీరవెంకటసత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు కొల్లె సూర్యనారాయణ, యాండ్ర విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: గూడపల్లిలో జనవాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని గ్రామస్థులు దుకాణం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళనకారులు తెలిపారు. దుకాణం తొలగించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

నిర్లక్ష్యానికి మోక్షమెప్పుడో!

అంబాజీపేట-అమలాపురం ప్రధాన రహదారి చెంతన తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని వినాయకుడి ఆలయం వద్ద ఉన్న ఓ విద్యుత్తు స్తంభమిది. వర్షాకాలం కావడంతో పాదులు స్తంభం కింది నుంచి పైవరకు పాకాయి. తరచూ విద్యుత్తు సరఫరాకు అంతరాయ ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యుత్తుశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, అంబాజీపేట



పారిశుద్ధ్య లోపంతో అవస్థలు



మండలంలోని అవిడి, గంటి గ్రామాలలో ప్రధాన రహదారి చెంతనే చెత్త పేరుకుపోవడంతో దుర్వాసనతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కుక్కలు, పందులు చిందరవందర చేస్తుండటంతో చెత్త రోడ్డుపైకి చేరుతోంది. గంటి గ్రామంలో శివాలయం వీధి, చినపేట కాలనీలో చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయమవుతోంది. వర్షం నీరు నిలిచిఉండటం, చెత్త పేరుకుపోవడం వంటి పారిశుద్ధ్య లోపంతో వ్యాధులు ప్రబలుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అవిడి పంచాయతీ కార్యదర్శి రెడ్డినాయుడిని వివరణ కోరగా, తక్షణం చెత్త తొలగించేలా, రోడ్లపై నీరు నిలిచి ఉండకుండా చర్యలు చేపడతామన్నారు.

- న్యూస్‌టుడే, కొత్తపేట

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

నిత్యాన్నదాన పథకానికి విరాళం


దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న సహాయ కమిషనర్

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: మురమళ్ల వీరేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు రూ.లక్ష వితరణ చేశారు. ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ సోదరుడు మాచిరాజు వెంకటసత్య సరేశ్వర సాయిరామ్ రూ.లక్ష చెక్కును శుక్రవారం అందజేశారు. దాతకు స్వామివారి చిత్రపటం బహూకరించారు.

పనుల గుర్తింపునకు గ్రామసభలు

అల్లవరం, న్యూస్‌టుడే: గ్రామాల్లో చేపట్టబోయే ఉపాధిహామీ పనుల గుర్తింపుకోసం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీవో శ్రీనుబాబు తెలిపారు. శుక్రవారం 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులకు సంబంధించి గ్రామసభల్లో ప్రజల నుంచి సూచనలు తీసుకున్నారు. ఎంపీపీ ఇళ్ల శేషారావు మాట్లాడుతూ వేతనదారులకు ఎంత మొత్తంలో పనులు చూపిస్తే దానికి అనుగుణంగా మెటీరియల్ కాంపోనెంట్ వస్తుందన్నారు. ఆ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు సమకూర్చుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో రూ.80 లక్షల విలువైన 130 పనులకు గ్రామసభ ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమంలో సర్పంచి విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అమలాపురం: 79811 19595, ముమ్మిడివరం: 80085 74166

పైపులైనుకు మరమ్మతులు

సమస్య: కందికుప్ప పరిధిలో తాగునీటి పైపులైను పగిలి నీరు లీకవుతుంది. - స్థానికులు

పరిష్కారం: ఈ సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబ్బహ్మణ్యం దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. తమ సిబ్బందితో పగిలిన పైపులైనుకు మరమ్మతులు చేయించారు.

రావులచెరువులో వీధి దీపాలకు..

సమస్య: కొప్పిగుంట పంచాయతీలోని రావులచెరువులో కొన్నిచోట్ల వీధిదీపాలు వెలగడం లేదు. - గ్రామస్థులు

పరిష్కారం: ఈ సమస్యను పంచాయతీ సర్పంచి వెంకటలక్ష్మికి తెలుపగా స్పందించారు. సిబ్బందితో వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు.

- న్యూస్‌టుడే, కాట్రేనికోన

పనికిరాని మొక్కల తొలగింపు

సమస్య: అమలాపురం హౌసింగ్‌బోర్డుకాలనీ మురుగు కాలువపై పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. మురుగు ముందుకు కదలక ఇబ్బంది పడుతున్నాం. - శ్రావణి, గృహిణి

సమస్య: అమలాపురం కామనగరువు శివారు డ్రైన్‌లో పూడికలతో మూసుకుపోయింది. మురుగు ముందుకు కదలక దోమలు పెరిగిపోయాయి. - అప్పారావు, వ్యాపారి

పరిష్కారం: ఈ సమస్యలపై వార్డు సచివాలయ కార్యదర్శి వీరన్న స్పందించారు. సిబ్బందితో వాటిని తొలగింపజేశారు.

- న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

స్లూయిస్‌లు ఇలా.. సాగు ఎలా?


వైరుపేట వద్ద డ్రెయిన్‌లో కలుస్తున్న సాగునీరు

న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం, కాట్రేనికోన

వేలాది ఎకరాలకు సాగునీరు అందించే పంట కాలువలపై స్లూయిస్‌లు పలుచోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. ఖరీఫ్ పూర్తయి రబీకి రైతులు సమాయత్తం అవుతున్నారు. ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాల్లో ముంపు భయంతో చాలా వరకు రైతులు సాగు చేపట్టలేదు. ఖాళీగా వదిలేసిన చేలను రబీకి సిద్ధం చేసేందుకు సమయాత్తం అవుతున్నారు. నవంబరు 15 నాటికి నారుమడులు వేయగలిగితే వేసవి నీటిఎద్దడి రాకుండా పంట చేతికందుతుందని, దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఈ తరుణంలో రెగ్యులేటర్లకు మరమ్మతులు చేస్తే సాగుకు ఆటంకం లేకుండా ఉంటుందంటున్నారు.


చల్లపల్లి కొత్తకాలువపై తుప్పుపట్టిన తలుపులు

ఉప్పలగుప్తంలో..

ఈ మండలంలో సుమారు 7 వేల ఎకరాల వరి ఆయకట్టు ఉంది. ప్రధానంగా పది వరకు పంట కాలువలు ఉన్నాయి. అమలాపురం-చల్లపల్లి కాలువపై శివారు వైరుపేట వద్ద వాసాలతిప్ప డ్రెయిన్‌కు అనుసంధానంగా నిర్మించిన స్లూయిస్ తలుపులు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు చెక్కలు, కొబ్బరి ఆకులు, బరకం అడ్డుగా పెట్టారు. దీని పరిధిలోని కొత్తకాలువ, కూనవరం, కిత్తనచెరువు కాలువల రెగ్యులేటర్లు మరమ్మతులకు గురయ్యాయి. అయినాపురం-కూనవరం, పేరూరువారివు కాలువలపై పలుచోట్ల స్లూయిస్‌లు పాడయ్యాయి.

కాట్రేనికోనలో..

ఈ మండలంలో సుమారు 8 వేల ఎకరాల్లో వరిసాగు విస్తీర్ణం ఉంది. ముంపు సమస్య కారణంగా 5,500 ఎకరాల్లో మాత్రమే ఖరీఫ్‌లో సాగు చేపట్టారు. పల్లంకుర్రు-బొబ్బర్లంక ప్రధాన పంటకాలువ శివారు బూలవారిమొండిలో స్లూయిజ్ తలుపు పాడైంది. ఇక్కడ గోడలు సైతం దెబ్బతిన్నాయి. శివారున ఉన్న ఆయకట్టుకు రబీలో సక్రమంగా నీరు అందించాలంటే దీనికి అవసరమైన మరమ్మతులు చేపట్టాల్సిందే. ఎప్పటినుంచో ఇక్కడ తలుపునకు మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు. నడవపల్లిలోని తూర్పుపేట సమీపంలో కాలువపై తలుపులు పాడయ్యాయి.

రెండేళ్లుగా..

గత రెండేళ్లుగా స్లూయిస్ తలుపులకు మరమ్మతులు చేయలేదు. కొత్తకాలువకు అనుసంధానంగా ఉన్న స్లూయిస్ తలుపులు పూర్తిగా పాడయ్యాయి. అధికారులకు మొరపెట్టుకున్నా ఇంతవరకూ ఏర్పాటు చేయలేదు. నీటిని నియంత్రణ చేసే వీలు లేకపోవడంతో గత రబీలో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. అధికారులు స్పందించి స్లూయిస్‌లకు మరమ్మతులు చేపట్టాలి.

- కుంపట్ల త్రిమూర్తులు, చల్లపల్లి, ఉప్పలగుప్తం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


గూడపల్లి రక్షిత

అల్లవరం: దేవగుప్తం జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గూడపల్లి రక్షిత అండర్-14 షాట్‌పుట్ విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల స్వామి శుక్రవారం తెలిపారు. స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో భాగంగా ఇటీవల రాజమహేంద్రవరంలో నిర్వహించిన పోటీల్లో 7.70 మీటర్ల ప్రదర్శనతో ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. ఈ విద్యార్థినిని, పీఈటీ రాజ్‌కుమార్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రత్యేకావసరాల పిల్లలకు వసతుల కల్పన

అల్లవరం: భవిత కేంద్రాల్లో పిల్లలకు అవసరమైన అన్ని వసతులు కల్పించడం జరుగుతుందని జిల్లా సహితవిద్య కోఆర్డినేటర్ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన అల్లవరం మండలం గోడిలంక భవిత కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందించే అలవెన్స్ నవంబరులో విడుదల అవుతుందన్నారు. ● అల్లవరం గ్రామానికి చెందిన సాయిబాబా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తాగునీటి యంత్రం, భవిత కేంద్రంలో చదువుతున్న విద్యార్థి తల్లిదండ్రులు పప్పుల దుర్గాభవాని, కాట్రు నాగ రత్నం 10 కుర్చీలను అందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డ్వాక్రా యానిమేటర్లపై విచారణ

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: ఐ.పోలవరం మండలం కేశనకుర్రులో కొంత మంది డ్వాక్రా యానిమేటర్లు రుణాలు మంజూరు, రికవరీ సమయంలో అక్రమాలకు పాల్పడుతున్నారని గ్రామస్థులు చేసిన ఫిర్యాదుపై ఏపీవో శామ్యూల్ శుక్రవారం విచారణ చేపట్టారు. గ్రామ సర్పంచి బీర సత్యకుమారి ఆధ్యక్షతన జరిగిన సమావేశంలో డ్వాక్రా యానిమేటర్ల మోసాలను పలువురు విచారణాధికారికి వివరించారు. దీనిపై స్పందించిన ఆయన 15రోజుల్లోగా పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని శామ్యూల్ పేర్కొన్నారు.

పశుగణన గోడపత్రికల ఆవిష్కరణ

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: సమనస గ్రామ పంచాయతీలో సర్పంచి పరమట శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో పశుగణనకు సంబంధించిన గోడపత్రికలను శుక్రవారం ఆవిష్కరించారు. పశుగణన విధానాన్ని పశుసంవర్ధకశాఖ సహాయకుడు వెంకటేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ, తెదేపా గ్రామకమిటీ అధ్యక్షుడు సుబ్బరాజు, మాజీ సర్పంచి కాశీ తదితరులు పాల్గొన్నారు. రెడ్డిపల్లిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచి కరాటం ప్రసన్న, ఎంపీటీసీ సభ్యురాలు సత్తి ఆదిలక్ష్మి పాల్గొని గోడపత్రికలను ఆవిష్కరించారు.

ఉచిత బియ్యం బకాయిలు జమ

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న 3.35 లక్షల రేషన్ కార్డులకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించిన ఉచిత బియ్యం బకాయి సొమ్ములను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రంగస్వామి శుక్రవారం మీడియాకు తెలిపారు. బీపీఎల్ జాబితాలో ఉన్న ఎరుపు రంగు రేషన్ కార్డులకు నెలకు రూ.600 వంతున ఆగస్టు, సెప్టెంబరు నెలలకు రూ.1200, బీపీఎల్‌కు ఎగువనున్న పసుపు రేషన్ కార్డుదారులకు రూ.600 చొప్పున నగదును జమ చేస్తున్నామన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పిలుపునిచ్చారు. అమలాపురంలోని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు గృహంలో కూటమి నాయకుల విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ ఎన్నికల ఇంఛార్జి భూమిరెడ్డి రామ్‌గోపాలరెడ్డి, ఎమ్మెల్యే ఆనందరావు, కూటమి నాయకులు, తెలుగు మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ తన విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, బాబు, జిల్లా కార్యదర్శి అల్లాడ సోంబాబు, భాజపా జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, జనసేన పార్టీ కౌన్సిలర్లు యేడిద శ్రీను, బొర్రా వెంకటేశ్వరరావు, టి.నేతాజీ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

క్రీడాకారులకు అభినందన

అమలాపురం పట్టణం: శ్రీకాకుళంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొని రజత పతకం సాధించిన జిల్లా క్రీడాకారులు అభినందనీయులని ఎంపీ హరీష్‌మాధుర్ కొనియాడారు. అమలాపురంలోని జిల్లా సెపక్‌తక్రా క్రీడా అధ్యక్షుడు జవ్వాది తాతబాబు ఆధ్వర్యంలో క్రీడాకారులను ఎంపీ శుక్రవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్ యాండ్ర గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ హరీష్‌మాధుర్‌తో క్రీడాకారులు

‘మెప్మా అర్బన్ మార్కెట్’ ప్రారంభం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ‘మెప్మా అర్బన్ మార్కెట్’ను నగర పంచాయతీ ఛైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. మెప్మా పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన వివిధ ఉత్పత్తులను మార్కెట్‌లో ప్రదర్శించారు. ప్రతి నెలా మెప్మా అర్బన్ మార్కెట్‌ను నగర పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహిస్తామని.. మార్కెట్‌లో తినుబండారాలు, వస్త్రాలు, అల్లిక వస్తువులు, ఎండు ఫలాలు స్టాల్స్‌లో ఏర్పాటు చేస్తామన్నారు. ఇన్‌ఛార్జి కమిషనర్ పీవీ సుధాకర్, చెల్లి అశోక్, పిల్లి నాగరాజు, మెండి కమల, సోమాని భాస్కర్, రాజేశ్వరి, స్వయం సహాయక సంఘాల సభ్యులు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఛైర్మన్ ప్రవీణ్‌కుమార్

ఆధార్ సేవలు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: ప్రత్యేక ఆధార్ శిబిరాల్లో భాగంగా కాట్రేనికోన పంచాయతీ ఆవరణలో శుక్రవారం ఆధార్ క్యాంపు నిర్వహించారు. పలువురు ప్రజలు ఆధార్‌లో పేరు, చిరునామా మార్పు, అప్‌డేట్ చేసుకోవడం వంటి సేవలను పొందారు. ఎంపీడీవో వెంకటాచలం శిబిరం పరిశీలించారు. స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంత..

ఎస్.యానాం అంగన్‌వాడీ కేంద్రం చెంత నీటిగుంత ప్రమాదాన్ని తలపిస్తోంది. గతంలో తొలగించిన శిథిల తుపాను రక్షిత భవనానికి సంబంధించిన సెప్టిక్ ట్యాంకును అలాగే వదిలేశారు. అనంతరం ఆ ప్రదేశంలో అంగన్‌వాడీ కేంద్రం, పశువుల ఆసుపత్రి తదితర భవనాలు నిర్మించారు. ప్రస్తుతం గుంత నిండా వాననీరు ఉంది. చిన్నారులు బయట ఆడుకునే క్రమంలో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. అధికారులు ఈ గొయ్యిని మూసివేయాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం




ఈ నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో



గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించేందుకు గత ప్రభుత్వం చేపట్టిన వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం మండలంలోని కొన్ని ప్రాంతాల్లో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. కుండలేశ్వరంలో చేపట్టిన వెల్‌నెస్ సెంటర్ నిర్మాణం స్లాబ్ పూర్తయ్యి ఏడాది గడుస్తోంది. మిగిలిన పనులు ముందుకు సాగడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి ఈ నిర్మాణం పూర్తిచేసి వైద్యసేవలను అందించాలని కోరుతున్నారు. దీనిపై మండల జేఈ ఫకీర్‌ను వివరణ కోరగా కూటమి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, కాట్రేనికోన

అందుబాటులోకి వచ్చేనా..!



బండారులంక-1 సచివాలయ భవనాన్ని ఎన్నికల ముందు హడావుడిగా అప్పటి మంత్రి పినిపే విశ్వరూప్ ప్రారంభించారు. ఇప్పటికీ ఆ భవనం అందుబాటులోకి రాలేదు. నిధులు సరిపడకపోవడంతో పనులు చేపట్టని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం గ్రామపంచాయతీ భవనంలోనే సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. దీనిపై పంచాయతీరాజ్ ఏఈ రాధాకృష్ణను వివరణ కోరగా ప్రభుత్వం కేటాయించిన నిధులు పూర్తిగా వినియోగించామని, మిగిలిన నిధులు వచ్చిన వెంటనే పనులు పూర్తి చేస్తామన్నారు.

– న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

‘మన బడి- మన భవిష్యత్తు’ పనులు

అల్లవరం: జిల్లావ్యాప్తంగా మన బడి- మన భవిష్యత్తు పథకంలో భాగంగా జరుగుతున్న పాఠశాలల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సమగ్రశిక్ష అదనపు సంచాలకులు మధుసూదనరావు అన్నారు. శుక్రవారం అల్లవరం ఎమ్మార్సీ కార్యాలయంలో అధికారులు, ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న పనులు త్వరితగతిన పూర్తిచేసి విద్యార్థులకు సేవలు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రతి విద్యార్థికి 12 అంకెలతో కూడిన అపార్ సంఖ్యను కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం పూర్తిస్థాయి నాణ్యతతో అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష జిల్లా అధికారి సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు కిరణ్‌బాబు, ఏడుకొండలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముమ్మిడివరం: ఆర్థిక ఇబ్బందులు, తల్లిదండ్రులు మందలించారని మనస్తాపంతో పురుగు మందు తాగిన యువకుడు శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని రాజుపాలేనికి చెందిన తాడాల దుర్గాప్రసాద్(25) తల్లిదండ్రులతో కలిసి బళ్లగేటు సెంటర్‌లోని పోలీస్ క్వార్టర్స్ వెనుక వీధిలో ఉంటున్నారు. మృతుడి సోదరి అనారోగ్యంతో పుట్టింట్లో వైద్య సేవలు పొందుతున్నారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. తాత్కాలిక డ్రైవర్‌గా పనిచేస్తున్న దుర్గాప్రసాద్ డబ్బులు ఇవ్వడం లేదని తల్లిదండ్రులు మందలించడంతో ఈనెల 23న గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి చేరుకోవడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దుర్గాప్రసాద్ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.జ్వాలాసాగర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

అమలాపురం పట్టణం: అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రి ఎదురుగా రెండు ద్విచక్రవాహనాలు శుక్రవారం ఢీకొన్నాయి. ఈ ఘటనలో అనాతవరం గ్రామానికి చెందిన కొండమంచిలి సత్యనారాయణ తీవ్రంగా గాయపడ్డారు. ముక్తేశ్వరం మండలం తొత్తరముడికి చెందిన యువకులు వేగంగా వచ్చి ఢీకొట్టారని స్థానికులు తెలిపారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పట్టణ ఎస్సై కిషోర్‌బాబు వివరాలు సేకరించారు.

రెండు చోట్ల చోరీ

అల్లవరం: అల్లవరం మండలం దేవగుప్తం పరిధిలో గురువారం రాత్రి రెండుచోట్ల దుండగులు చోరీలకు పాల్పడ్డారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న వస్త్ర దుకాణంలో రూ.1500 నగదు ఎత్తుకెళ్లారు. జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న కనకదుర్గమ్మ ఆలయం తాళాలు పగులగొట్టి హుండీ ఎత్తుకెళ్లారు. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దుండగులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నం చేస్తున్నారు. ఈ సంఘటనలపై దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

కొండచిలువ హతం

ఐ.పోలవరం: ఐ.పోలవరం మండలం పశువుల్లంక వారధి వద్ద 20 అడుగుల కొండచిలువను స్థానిక పశువుల కాపరులు హతమార్చారు. మత్స్యకారులు వేటసాగించే వలకు చిక్కుకుని ఒడ్డున పడి ఉండటంతో పశువుల కాపరులు దీనిని హతమర్చారు. ఇటీవల సంభవించిన వరదలకు కొండచిలువ కొట్టుకువచ్చిందని భావిస్తున్నారు.

తాచుపాము హల్‌చల్

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని మహిపాలచెరువు ప్రాంతంలోని ఓ ఇంటి వద్ద తాచుపాము హల్‌చల్ చేసింది. కడలి ధర్మారావు ఇంటి వద్ద పాము కనిపించడంతో కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురయ్యారు. స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం ఇవ్వగా.. ఆయన వచ్చి పామును చాకచక్యంగా పట్టుకుని నిర్మానుష ప్రాంతంలో వదిలిపెట్టడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కథా సంపుటి ఆవిష్కరణ రేపు

యానాం: యానాం రచయిత రత్నాకర్ పెనుమాక రచించిన రెండో కథా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం భీమ్‌నగర్‌లో జరగనుంది. ఇటీవల ప్రపంచ స్థాయి కథల పోటీల్లో రత్నాకర్ కథకు ప్రథమ బహుమతి వచ్చింది. మరో కథను ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులకు పాఠ్యాంశంగా ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో దాట్ల దేవదానంరాజు అధ్యక్షతన నిర్వహించే కార్యక్రమంలో పుదుచ్చేరి ప్రభుత్వ దిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తన రెండో కథా సంపుటి ఆవిష్కరిస్తారని రత్నాకర్ తెలిపారు.

డంపింగ్‌యార్డు సమస్య పరిష్కరించాలి

అమలాపురం కలెక్టరేట్: అమలాపురం మండలం బండారులంక పరిధిలో నెలకొన్న డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు శుక్రవారం డీఆర్వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. గత కొన్నాళ్లుగా తాము ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని, అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చినా చర్యలు చేపట్టలేదని వాపోయారు. అనంతరం వారు స్థానిక ఎమ్మెల్యే ఆనందరావుకు సైతం వినతిపత్రం అందజేశారు.

జనసేన నాయకుడికి ఎంపీ పరామర్శ

ఉప్పలగుప్తం: గొల్లవిల్లికి చెందిన జనసేన నాయకుడు నాగిరెడ్డి నాగబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆయన్ను అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్ శుక్రవారం పరామర్శించారు. తెదేపా మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, కూటమి నాయకులు ఆయన వెంట ఉన్నారు.

ఆరోగ్యం.. ఆహ్లాదం..

సక్షం పథకంలో అంగన్‌వాడీ కేంద్రాల ఎంపిక

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

ఆరేళ్లలోపు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పూర్తిస్థాయిలో పోషకాహారం అందించడమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటిల్లో కొన్ని రకాల సమస్యలు పేరుకుపోవడంతో ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు. వీటిని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళాభివృద్ధి శిశుసంక్షేమశాఖ చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా సక్షం(స్టిమ్యూలేటింగ్ అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ ఫర్ సస్టెయినబుల్ హెల్త్ మేనేజ్‌మెంట్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో 340 కేంద్రాలను ఈ పథకానికి ఎంపిక చేశారు. సక్షం పథకంలో భాగంగా పోషకాహార తోటలు(న్యూట్రి గార్డెన్స్) పేరిట ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాల్లో సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల మొక్కలు పెంచుతారు. వాటిని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పంపిణీ చేస్తారు. రక్షిత మంచినీటిని అందించేందుకు శుద్ధజల యంత్రాలు సమకూరుస్తారు. వీటి నిర్వహణ బాధ్యతలు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం చూసుకుంటుంది.

జిల్లాలో 7 ప్రాజెక్టుల పరిధిలో 1,726 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో గర్భిణులు 7,531, బాలింతలు 8,602, ఆరు నెలల లోపు చిన్నారులు 7,504, మూడు నెలల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 40,101 మంది ఉన్నారు. వీరికి ప్రతినెలా అంగన్‌వాడీల నుంచి పోషకాహారం అందిస్తున్నారు. సక్షం పథకానికి ఎంపికైన వాటిలో తల్లీబిడ్డ ఆరోగ్య పరిరక్షణ, బాలల మానసిక, శారీరక ఎదుగుదలకు వసతులు, కేంద్రాల వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం ఉండే విధంగా చర్యలు చేపట్టనున్నారు. కార్టూన్లు, బొమ్మలు, ఆటపాటలు, చిట్టి కథలను ఎల్‌ఈడీ తెరలపై చూపుతూ ఆసక్తికరంగా బోధించనున్నారు. శుద్ధమైన తాగునీరు, మరుగుదొడ్లు, కుర్చీలను ఏర్పాటు చేస్తారు. అమలాపురం ప్రాజెక్టు పరిధిలో 43, ముమ్మిడివరం ప్రాజెక్టు పరిధిలో 84 కేంద్రాలను ఎంపిక చేశారు.

నిధుల కేటాయింపు..

ఒక్కో కేంద్రానికి రూ.45,800 చొప్పున మొత్తం 340 కేంద్రాలకు రూ.1,55,72,000 మంజూరయ్యాయి. ఇందులో పోషణ వాటిక (పెరటి తోట) కోసం రూ.10 వేలు, ఇంకుడు గుంతకు రూ.16 వేలు, విద్య, ఆట వస్తువుల సామగ్రి కొనుగోలుకు రూ.19,800 కేటాయించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణానికి ఇటీవలే ప్రత్యేక నిధులు కేటాయించింది. ప్రస్తుతం అదనంగా మరో 340 కేంద్రాలకు సక్షం పథకంలో నిధులు మంజూరు చేయడం విశేషం.


అల్లవరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

మంచి ఆహారం అందిస్తాం

జిల్లాలో సక్షం పథకానికి ఎంపికైన కేంద్రాల్లో పెరటి తోటలు పెంచి లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారం అందిస్తాం. చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ పనులను త్వరితగతిన పూర్తిచేసి వసతులు అందుబాటులోకి తీసుకువస్తాం.

- ఝాన్సీరాణి, ఐసీడీఎస్ పీడీ



ట్రోఫీ అందుకుంటున్న క్రీడాకారులు

బాస్కెట్‌బాల్ పోటీల్లో రామచంద్రపురం ప్రథమం

రాజానగరం: నన్నయ విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా నిర్వహించిన అంతర్ కళాశాలల బాస్కెట్ బాల్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో విజేతలను ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్, స్పోర్ట్స్ బోర్డు ఇన్‌ఛార్జ్ కార్యదర్శి ఆచార్య జి.సుధాకర్ శుక్రవారం ప్రకటించారు. ఈ పోటీల్లో రామచంద్రాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.

మండపేట

•మండపేట • రామచంద్రపురం

డంపింగ్‌యార్డు పనులకు భూమిపూజ

ద్రాక్షారామ: ద్రాక్షారామ గ్రామ పంచాయతీ పరిధిలో డంపింగు యార్డు ఏర్పాటు చేయడానికి ఆదివారపు పేట గ్రామం వద్ద కేటాయించిన రెండు ఎకరాల స్థలం వద్ద శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం యార్డుకు వెళ్లే మార్గంలో కల్వర్టు నిర్మించడానికి పనులు ప్రారంభించారు. సర్పంచి కొత్తపల్లి అరుణ మాట్లాడుతూ డంపింగ్ యార్డు అందుబాటులోకి వస్తే త్వరలో ద్రాక్షారామకు చెత్త సమస్య పరిష్కారం అవుతుందన్నారు.



ఆదివారపుపేట వద్ద శంకుస్థాపన

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

తుప్పలు తొలగించారు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం పట్టణ పెద్ద వంతెన నుంచి వెల్ల రోడ్డు వెళ్లే మార్గంలో రహదారికి ఇరువైపులా మొక్కలు, తుప్పలు ఏపుగా పెరిగి ప్రమాదకరంగా మారాయి. దీనిపై ఈ నెల 23వ తేదీన "మూసుకు పోతున్న రహదారి" శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు స్పందించారు. శానిటరీ తనిఖీదారు పర్యవేక్షణలో సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న మొక్కలను తొలగిస్తున్నారు.

రహదారి పక్కన శుభ్రం

ద్వారపూడి: మండపేట మండలం ద్వారపూడి పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీ అధికారులు దృష్టి సారించి ప్రత్యేక చర్యలు చేపట్టారు. రైల్వే స్టేషన్ రోడ్డులో రహదారి పక్కన తుప్పలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయి రహదారి కనిపించడంలేదని, రహదారిపై చెత్తతో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని స్థానికులు మేమున్నాం... మీకు తోడుగా.. దృష్టికి తీసుకురావడంతో పంచాయతీ కార్యదర్శి ఆకుల వి.వి.రమణకు వివరించగా స్పందించారు. వెంటనే ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపట్టి రహదారికి అడ్డుగా ఉన్న పిచ్చి మొక్కలు, చెత్త తొలగించారు.

చెత్త తొలగించరూ..

సమస్య: మండపేట మండలం జడ్.మేడపాడు పంచాయతీ పరిధి ఎస్సీ కాలనీ వాటర్ ట్యాంకు వీధి ప్రభుత్వ పాఠశాల ఎదురుగా రహదారి పక్కన చెత్త పోస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతుంది. సమస్య పరిష్కరించాలి.

- డి.సుబ్బారావు, జడ్.మేడపాడు

సమాధానం. వాటర్ ట్యాంకు వీధి ప్రభుత్వ పాఠశాల ఎదురుగా రహదారి పక్కన పోస్తున్న చెత్తను తొలగించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- అమర్‌నాథ్‌చౌదరి, పంచాయతీ కార్యదర్శి, జడ్.మేడపాడు

–న్యూస్‌టుడే, ద్వారపూడి

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య

మండపేట : **80085 74183** రామచంద్రపురం: **80085 74191**

సాంకేతిక శిక్షణ.. భవితకు రక్షణ

న్యూస్‌టుడే, అంగర, రామచంద్రపురం

దివ్యాంగ చిన్నారులకు వివిధ అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో భవిత కేంద్రాలను నిర్వహిస్తోంది. వారికి అవసరమైన అన్ని రకాల వసతులు కల్పిస్తూ శారీరకంగా అవసరమైన ఫిజియోథెరపీ సేవలు కొనసాగిస్తుంది. ఐఈఆర్పీలు డిజిటల్ యంత్రాలపై విద్య నేర్పిస్తూ, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నారు. సాధారణ పాఠశాలల మాదిరిగా ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహిస్తూ మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం సకాలంలో సేవలు అందించకుండా, బోధకులకు బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యం వహించింది. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు మూడేళ్ల పాటు ఫిజియోథెరపీ సేవలను దూరం చేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో తిరిగి ఫిజియోథెరపీ సేవలు ప్రారంభమయ్యాయి.

మండలం	ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు	కేంద్రాల్లో ఉన్నవారు
రాయవరం	115	21
మండపేట	139	20
కపిలేశ్వరపురం	77	24
రామచంద్రపురం	160	20
కె.గంగవరం	82	21



చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో మండలానికి ఒకటి చొప్పున భవిత కేంద్రాలు ఉన్నాయి. వాటిలో ఒక్కో కేంద్రంలో 20 మందికి తగ్గకుండా చిన్నారులు ఉన్నారు. ఇటీవలే ఐఈఆర్పీలకు ట్యాబ్‌లు సమకూర్చారు. విద్యా సంబంధిత యాప్‌లు డౌన్‌లోడ్ చేయించి, నిపుణులైన శిక్షకులతో చిన్నారులకు తర్ఫీదు ఇస్తున్నారు. ఉపాధ్యాయుల బోధన తీరుతో పాటు, విద్యార్థుల ప్రగతి ఎప్పటికప్పుడు నమోదయ్యేలా ఏర్పాట్లు చేశారు. అన్ని కేంద్రాల్లో ఇద్దరు శిక్షకులు ఉన్నారు. వారికి ఇటీవలే రెండు ట్యాబ్‌లు ఇచ్చారు. చదువుతో పాటు, ఇతర పనులు సులువుగా చేసుకునేందుకు ఈ యాప్‌లు ఉపకరిస్తున్నాయి. యోగా థెరపీ, ఆటలు, వ్యాయామాలు, ఆర్ట్, క్రాఫ్ట్ తదితర వాటిల్లో ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. సొంతంగా కదల్లేని దివ్యాంగ చిన్నారుల కోసం వారానికి ఒక రోజు గృహ ఆధారిత విద్య అందిస్తున్నారు. కదలికలు, కండరాల్లో వైకల్యం, మెదడు పక్షవాతం, నరాల బలహీనత కారణంగా బాధపడుతున్న చిన్నారులకు భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ చేస్తున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు నెలకు రూ. 300 చొప్పున పది నెలలకు రూ.3,000 అందించాలి.



కపిలేశ్వరపురంలో ట్యాబ్‌లో బోధన

ఇంటి నుంచి బయటకు రాలేని వారికి గృహ ఆధారిత విద్యలో భాగంగా నెలకు రూ.300 చొప్పున అందజేయాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక 2024-25 సంవత్సరానికి బడ్జెటు కేటాయింపులు జరిగాయి.

సద్వినియోగం చేసుకోవాలి

మండలానికి ఒకటి చొప్పున భవిత కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. నిపుణులతో నిర్వహిస్తున్న కేంద్రాలను అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలి. ఇక్కడ అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయి. రవాణా భత్యాలకు ఈ ఏడాది బడ్జెటులో నిధులు మంజూరయ్యాయి. భవిత కేంద్రాలకు భవనాల సౌకర్యాలపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

- బి.సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్షా కమ్యూనిటీ జిల్లా మొబలైజేషన్ అధికారి

నేడు మహిళా స్వశక్తి భవనం ప్రారంభం

మండపేట, న్యూస్‌టుడే: స్థానిక గొల్లపుంత కాలనీలో గత తెదేపా హయాంలో నిర్మించిన మహిళ స్వశక్తి భవనాన్ని ఎట్టకేలకు శనివారం ప్రారంభించనున్నారు. గతంలో తెదేపా ప్రభుత్వం హయాంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చిన రూ.2 కోట్లు ఆదాయంతో దీనిని వారి అవసరాల కోసం నిర్మించారు. పనులు పూర్తయి ప్రారంభోత్సవం చేసే సమయానికి ఎన్నికల నియమావళి వచ్చింది. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభించనున్నారు.

భాజపా సభ్యత్వాల నమోదు

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలం అంగరలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. జిల్లా సభ్యత్వ ప్రముఖ్ కోన సత్యనారాయణ, రాష్ట్ర కిసాన్ సెల్ కార్యవర్గ సభ్యుడు వల్లభనేని రవీంద్రబాబు పాల్గొని సభ్యత్వాల ఆవశ్యకతను గ్రామస్థులకు వివరించారు. కార్యక్రమంలో తోరం రాము, కంకటాల నాగబాబు, స్థానిక భాజపా నాయకులు పాల్గొన్నారు.

నవంబరు 3న చలో విజయవాడ

మండపేట, న్యూస్‌టుడే: వక్ఫ్‌బోర్డు పరిరక్షణపై నవంబరు 3వ తేదీన విజయవాడలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని అబ్దుల్ కలామ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ మౌలానా, జమాతె కోనసీమ జిల్లా అధ్యక్షుడు అమీర్, సయ్యద్ ఇబ్రహీమ్ తదితరులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండపేటలో గోడపత్రిక ఆవిష్కరించారు. కార్యక్రమంలో మౌలాలీ, షేక్ ఇబ్రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

పశుపోషణతో అదనపు ఆదాయం

మండపేట, న్యూస్‌టుడే: వ్యవసాయం చేసేవారు, వ్యవసాయ కూలీలు పశుపోషణ కూడా చేసుకుంటే అదనపు ఆదాయం పొందవచ్చని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండపేట తెదేపా కార్యాలయంలో గోడపత్రిక ఆవిష్కరించారు. పశుగణనకు వచ్చే వారు పశువులు, కోళ్లు, మేకలు వంటి సమాచారాన్ని సేకరిస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజ్‌కుమార్, ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, సానబోయిన రాజు, కుక్కల రామారావు తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

పామర్రు: పశుసంపదను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. పామర్రులో శుక్రవారం పశువైద్యాధికారిణి బిందు ఆధ్వర్యంలో 21వ పశుగణన కార్యక్రమం ప్రారంభమైంది. శుక్రవారం ప్రారంభమైన ఈ కార్యక్రమం వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచి వి.వెంకటదుర్గ, కూటమి నాయకులు ఎం.సూరిబాబు, బి.త్రిమూర్తులు పాల్గొన్నారు.



పామర్రులో పాల్గొన్న ఎంపీపీ నాగమణి తదితరులు

ద్రాక్షారామ: పశుగణన సర్వేకు రైతులు సహకరించాలని వెల్ల పశువైద్యాధికారి రామచంద్రరావు కోరారు. శుక్రవారం వెల్ల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పశుగణన సర్వేకు సంబంధించి గోడపత్రికను ఆవిష్కరించారు. పశుగణన ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచి వీరబోయిన సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు చిక్కాల స్వామికాపు, కార్యదర్శి ఎస్.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రతిభ చాటి.. బహుమతులు పట్టి

మండపేట, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం మండపేటలోని ఆలమూరు రోడ్డులో అన్నపూర్ణ హైస్కూల్‌లో నిర్వహించిన వ్యాస రచన పోటీలో విద్యార్థులు తమ ప్రతిభ చూపించి బహుమతులు సాధించారు. ఇంటర్నెట్ వాడకం వల్ల లాభాలు, నష్టాలు. విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై నిర్వహించిన పోటీలో 10వ తరగతి విద్యార్థిని బూల వర్షిణి మొదటి బహుమతి, 9వ తరగతి విద్యార్థిని చక్కా శ్రావణి ద్వితీయ బహుమతి, 8వ తరగతి విద్యార్థిని నడిపల్లి లక్ష్మీదేవి తృతీయ బహుమతి సాధించారు. పాఠశాల డైరెక్టర్ వల్లూరి సత్యనారాయణ 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను, ప్రశంసాపత్రాలను విద్యార్థులకు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా వీఎం దాస్, వి.జయశ్రీ, టి.ఫాతిమా, పి.రమేష్‌బాబు, వి.మల్లికార్జునరావు, వి.రమేష్ వ్యవహరించారు.



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు



విద్యార్థులకు బహుమతులు అందజేసిన డైరెక్టరు వల్లూరి సత్యనారాయణ తదితరులు

పోలీసు విధులపై విద్యార్థులకు అవగాహన

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా శుక్రవారం ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈనెల 21 నుంచి పోలీసు అమర వీరుల సంస్మరణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. తోటపేట సూర్య ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీస్టేషనులో నిర్వహించే కార్యకలాపాలు గురించి ఎస్సై ఎం.లక్ష్మణ్ ఆధ్వర్యంలో సిబ్బంది వివరించారు. పోలీస్టేషనులో ఏఏ విభాగాలు ఉంటాయి, పోలీసు విధులేంటి, వైర్‌లెస్ సెట్ అంటే ఏంటి, ఎలా పనిచేస్తుంది అనే విషయాలు వివరించారు.

నిబంధనల మేరకు బాణసంచా విక్రయించాలి



సమావేశంలో డీఎస్పీ రామకృష్ణ, సీఐ అశోక్‌కుమార్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: నిబంధనల మేరకు రామచంద్రపురం నియోజకవర్గంలో దీపావళి బాణసంచా విక్రయాలు జరగాలని నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, సీఐ కడియాల అశోక్‌కుమార్ పేర్కొన్నారు. రామచంద్రపురం పోలీస్‌స్టేషన్‌లో బాణసంచా విక్రయ తాత్కాలిక లైసెన్సుదారులతో వారు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇసుక, అగ్నిమాపక యంత్ర పరికరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐలు పాల్గొన్నారు.

దుకాణాల తనిఖీ



అగ్నిమాపక పరికరాలు పనితీరు పరీక్షిస్తున్న అధికారులు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: రామచంద్రపురం మండలంలో ఉన్న బాణసంచా తయారీ దుకాణాలను శుక్రవారం పోలీసు, అగ్నిమాపక అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. డీఎస్పీ రామకృష్ణ, రామచంద్రపురం సీఐ కడియాల అశోక్, ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్, అగ్నిమాపక అధికారి నాగేశ్వరరావు కలిసి ద్రాక్షారామలో ఆంజనేయ ఫైర్ వర్క్స్, పెద్దిరెడ్డి సుబ్బారావు ఫైర్ వర్క్స్ దుకాణాలు తనిఖీ చేశారు. అక్కడ ఉన్న అగ్నిమాపక పరికరాలను పరీక్షించారు. అనంతరం ద్రాక్షారామ పోలీస్టేషను వద్ద తాత్కాలిక బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తున్న వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి అగ్ని మాపక పరికరాలు ఏవిధంగా ఉపయోగించాల్లో ప్రయోగాత్మకంగా చూపించారు.

మూడు నిరుపేద కుటుంబాలకు ఇళ్లు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం పట్టణంలోని మూడు నిరుపేద కుటుంబాలకు టిడ్కో గృహాలు అందజేయడమే కాకుండా వారితో కలసి గృహప్రవేశ కార్యక్రమాలను రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చేయించారు. శుక్రవారం పట్టణ కొత్తూరులో ముగ్గురు నిరుపేదలకు టిడ్కో గృహాలను అందజేసి తొలుత రిబ్బన్ కట్ చేశారు. నిత్యావసర సరకులు, కూరగాయలు, దుస్తులు, దుప్పట్లు మంత్రి అందజేశారు.



లబ్దిదారుల కుటుంబానికి పత్రం అందజేస్తున్న మంత్రి సుభాష్ తదితరులు

120 మంది మహిళలకు జీవనోపాధి

చిన్న వయసులోనే భర్త చనిపోయిన నిరుపేద మహిళలను నియోజకవర్గంలో 120 మందిని గుర్తించామని వారితో చిన్న పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల శాఖ సహకారంతో 90 శాతం రాయితీతో పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. మిగిలిన 10 శాతం లబ్ధిదారుల తరపున నిధులను తానే స్వయంగా సమకూరుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక ఇన్‌ఛార్జి, రాయలసీమ ఎమ్మెల్సీ రాంగోపాల రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, రామచంద్రపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు, టిడ్కో సీఎల్జీసీ బిందు మాధవి పాల్గొన్నారు.

సహాయనిధి చెక్కు అందజేత

అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఇద్దరు వ్యక్తులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం రామచంద్రపురం హౌసింగ్‌బోర్డు కాలనీలో మంత్రి క్యాంప్ కార్యాలయంలో అందించారు. రామచంద్రపురం మండలం ఉండూరు గ్రామానికి చెందిన అనుసూరి రాంబాబుకు రూ.40వేలు, పట్టణానికి చెందిన గుత్తుల ముత్యాలరాజుకు రూ.75,699లు చెక్కు అందజేశారు.

వీధుల్లో అంధకారం..



మండపేట మండలం కేశవరం పంచాయతీ పరిధి దేవుడుతాళ్లు రక్షిత మంచినీటి ట్యాంకు వీధితో పాటు కొత్తకాలనీలో నెల రోజులుగా ఎల్ఈడీ వీధి దీపాలు వెలగడంలేదు. దీంతో రాత్రి సమయంలో ప్రజలు బయటకు వెళ్లడానికి బయపడుతున్న పరిస్థితి. పిల్లలు సాయంత్రం సమయంలో ట్యూషన్ నుంచి ఇంటికి తిరిగివచ్చేటప్పుడు వీధిదీపాలు వెలగక సెల్‌ఫోన్ వెలుతురులో ఇంటికి రావాల్సి వస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. పంచాయతీ అధికారులు దృష్టి సారించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఎన్.సుబ్బారావును వివరణ కోరగా పరిశీలించి వీధి దీపాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, ద్వారపూడి

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా 90వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన జాతీయ స్థాయి క్విజ్ పోటీల్లో రామచంద్రపురం వీఎస్ఎం ఇంజినీరింగ్ అటానమస్ కళాశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో విజయం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు బృంద నాయకుడు కేశవ వర్మ తెలిపారు. వి.ఎస్.ఎం ఇంజినీరింగ్ సీఎస్ఈ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వై.శంకరరావు, పి.సాత్విక్ జిల్లాస్థాయి ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈ నెల 28న విజయవాడలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు కళాశాల ఉపాధ్యక్షుడు ఎం.ఎస్.ఎస్.మూర్తి తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.బాలాజి, వైస్ ప్రిన్సిపల్ వి.రవీంద్ర, సూపరింటెండెంట్ జి.సూర్యనారాయణమూర్తి ఇతర అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న మూర్తి తదితరులు

ఆచరణ సాధ్యంకాని లక్ష్యాలు నిలిపేయాలి

రామచంద్రపురం, న్యూస్‌టుడే: అశాస్త్రీయమైన, ఆచరణ సాధ్యం కాని రోజుకో రకమైన టార్గెట్లను వెంటనే నిలుపుదల చేయాలని తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం విధులు నిర్వహణ అనంతరం నిరసన కార్యక్రమాన్ని చేశారు. మూడు రోజులుగా తపాలా శాఖలో కొంతకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిబ్బంది నల్లబ్యాడ్జీలతో తమ నిసనను వ్యక్తం చేస్తూ విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తపాలా శాఖ ఎన్ఎఫ్‌పీఈ నేతలు మాట్లాడుతూ ఎన్ఎఫ్‌పీఈ, ఏఐపీఈయూ గ్రూప్-సి సంఘాల గుర్తింపును కేంద్ర ప్రభుత్వం తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. 8వ వేతన సవరణ కమిటీని వెంటనే వేయాలని డిమాండ్ చేశారు. సక్రమైన రీతిలో డాక్ కర్మయోగి, బగాట్ కర్మయోగి శిక్షణ కార్యక్రమాలను చేపట్టాలని కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. యూనియన్ నేతలు కొండపల్లి సూర్యనారాయణ, రాంబాబు, సాయికృష్ణ, రామారావు, రాయుడు, గణపతి, గంగరాజు, గౌతమ్, సీతా మహాలక్ష్మి, రాజేశ్వరి, వెంకటరమణ, సురేష్, సిహెచ్.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న తపాలా ఉద్యోగులు

ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి

పిఠాపురం, న్యూస్‌టుడే: కందరాడలోని బాలాజీ రైస్ మిల్లులో పనిచేస్తుండగా పుట్టి వెంకటరమణ(36) ప్రమాదవశాత్తు జారిపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం పసలపూడికి చెందిన వెంకటరమణ ఇక్కడ కొంతకాలంగా పని చేస్తున్నాడు. శుక్రవారం షెడ్డు నిర్మాణ పని చేస్తుండగా జారడంతో తలకు రేకు తగిలి చనిపోయాడు. ఇతడికి భార్య, కుమారుడు ఉన్నారు. గ్రామీణ ఎస్సై గుణశేఖర్ అక్కడికి వెళ్లి మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మద్యం తాగి వాహనం నడుపుతున్న వ్యక్తికి జైలు

మండపేట గ్రామీణం: ద్వారపూడి సెంటర్లో మండపేట రూరల్ పోలీసు సిబ్బంది గురువారం డ్రంకెండ్‌డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడుపుతున్న లచ్చిరెడ్డిని అరెస్టు చేసి శుక్రవారం ఆలమూరు కోర్టులో హాజరుపరచగా జడ్జి ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు మండపేట రూరల్ ఎస్సై సురేష్‌బాబు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

అప్రోచ్ నిర్మాణం ఎప్పుడో..?

మండపేట, న్యూస్‌టుడే: పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో స్థానిక పెదకాలువ వద్ద రామచంద్రపురం కెనాల్‌పై పాత వంతెన పక్కన నీటిపారుదల శాఖ ద్వారా కొత్తగా వంతెన నిర్మాణం చేపట్టారు. దీంతోపాటు కాలేరు పంటకాలువపై మరో చిన్న కల్వర్టు కూడా నిర్మించారు. వంతెన, కల్వర్టులను అనుసంధానంగా అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేయలేదు. గుత్తేదారులకు బిల్లులు చెల్లించక పోవడం నిధుల కొరత తదితర కారణాల వల్ల అప్రోచ్ నిర్మాణానికి బ్రేక్ పడింది. అయినప్పటికీ గతంలో తెదేపా హయాంలో 2019 ఎన్నికల ముందు ఈ వంతెన నిర్మాణం పూర్తి చేసి ప్రారంభోత్సవం చేశారు. అయితే అప్రోచ్ రోడ్డు వేయక పోవడంతో ఎక్కువగా పాత వంతెన పై నుంచి వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వంలో ఈ వంతెన అప్రోచ్ రోడ్డు నిర్మాణం పట్టించుకోలేదు. ఆ రోడ్డు కాస్తా ఆక్రమణకు గురవుతోంది. వివిధ రకాల వ్యాపారాలకు నిలయంగా మారుతోంది. పట్టణంలో నానాటికి పెరుగుతున్న ట్రాఫిక్ కారణంగా ప్రస్తుతం ఉన్న రహదారులు సైతం ఇరుకుగా మారుతున్నాయి. కనీసం మాస్టర్ ప్లాను ప్రకారం విస్తరణ చేయాలని స్థానికులు కోరుతున్నారు. పట్టణంలో ఇదే ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ కారణంగా పార్కింగ్ స్థలాలు కూడా కరువయ్యాయి.



ఆక్రమణకు గురవుతున్న ప్రధాన రహదారి

ప్రతిపాదన పంపించాం

రామచంద్రపురం కెనాల్‌పై కొత్తగా నిర్మించిన వంతెనతోపాటు కాలేరు కల్వర్టు వరకు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి రూ.20లక్షలతో ప్రతిపాదన పంపించాం. నిధులు మంజూరు చేసిన తరువాత నిర్మాణం పనులు పూర్తి చేస్తాము.

- అజీజ్, జేఈఈ, నీటిపారుదల శాఖ, మండపేట

రెవెన్యూ గ్రామసభలు

అంగర, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టులో సర్వే పూర్తయిన గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పి.చిన్నారావు తెలిపారు. శుక్రవారం ఆయన కపిలేశ్వరపురం మండలం వడ్లమూరులో సర్పంచి చుండ్రు మంగాయమ్మ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. నిర్ణీత గడువు లోగా దరఖాస్తులన్నీ పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మండపేట గ్రామీణం: మెర్నిపాడు పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ గ్రామసభలు జరిగాయి. రీసర్వే, భూసమస్యల పరిష్కారానికి 7 వినతులు వచ్చాయి. ఆర్.ఐ వాసంతి, సర్వేయరు సుజాత, విఆర్ఓ బి.రామకృష్ణ పాల్గొన్నారు.



వడ్లమూరులో మాట్లాడుతున్న తహసీల్దారు చిన్నారావు